JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | మంగళవారం 16-06-2026
Medchal - Malkajgiri | Tuesday 16-06-2026
Follow: jayabherinews
సంపుటి : 03 | సంచిక : 15
పేజీలు : 8 | వెల : 5
Vol. 03 | Issue 15 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


## మెట్రో రైలు వ్యవస్థపై భగ్గుమన్న సీఎం రేవంత్



"హైదరాబాద్ మహానగరానికి అత్యంత ఆవశ్యకత కలిగిన మెట్రో విస్తరణ చేపట్టడానికి వీలుగా, ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రోను స్వాధీనం చేసుకోవడానికి అన్ని రకాల ఒప్పందాలు కుదిరినప్పటికీ ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి నిధులు ఎందుకు విడుదల కాలేదని ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

### ● కిషన్ రెడ్డి, కేటీఆర్‌పై నిప్పులు!

**హైదరాబాద్ :**

మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్కMLA, @వాకిటి శ్రీహరి, మహమ్మద్ అజహరుద్దీన్, పలువురు ఎంపీలు, ప్రజా ప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎల్ అండ్ టీ నుంచి మెట్రో మొదటి దశ స్వాధీనం, నిధుల సమీకరణ, రెండో దశ విస్తరణ అంశాలపై సవివరంగా తెలిపారు. హైదరాబాద్ విశ్వనగరంగా తీర్చిదిద్దడంతో పాటు పెట్టుబడులను ఆకర్షించడానికి మెట్రో రైలు విస్తరణ ఎంతో అవసరమని నొక్కి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిరభ్యంతర పత్రం (NOC) ఇస్తే కేంద్రం వాటా లేకుండానే వంద శాతం రాష్ట్ర ప్రభుత్వ ఈక్విటీతో మెట్రో రైలు రెండో దశ విస్తరణ చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఎల్ అండ్ టీ నుంచి మెట్రో మొదటి దశను స్వాధీనం చేసుకున్న తర్వాత రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంలో విస్తరణ చేపట్టాల్సి ఉందని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు మొదటి దశ స్వాధీనం చేసుకోవడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు.
మెట్రోను స్వాధీనం చేసుకోవడానికి ఎల్ అండ్ టీకి రూ.13,500 కోట్ల నిధుల కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఐఆర్ఎఫ్‌సీతో అన్ని రకాల ఒప్పందాలు పూర్తయ్యాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కౌంటర్ గ్యారెంటీ కూడా ఇచ్చామని చెప్పారు. ఐఆర్ఎఫ్‌సీ నుంచి ఈరోజు విడుదల కావలసిన నిధులు విడుదల కాలేదని చెబుతూ దీనికి కారణమేంటని ప్రశ్నించారు. మెట్రోను స్వాధీనం చేసుకునే విషయంలో చర్చోపచర్చల అనంతరం కుదిరిన ఒప్పందం మేరకు జపాన్ కు చెందిన ఆర్థిక సంస్థ ద్వారా నిధులు ఇప్పటికే ఐఆర్ఎఫ్‌సీ ఖాతాలో బదిలీ అయ్యాయని గుర్తుచేశారు. ఐఆర్ఎఫ్‌సీ ఖాతాలోకి నిధులు జమ అయినప్పటికీ, ఒప్పందం ప్రకారం ఎల్ అండ్ టీకి చెల్లించాల్సిన నిధులు ...మిగతాది 2 లో

## కుప్పకూలిన ఎయిర్‌ఫోర్స్ ఫైట్



### ● నడిరోడ్డుపై కుప్పకూలిన వైమానిక దళ శిక్షణ విమానం.. ఇద్దరు పైలట్ల దుర్మరణం!

**జయభేరి, న్యూఢిల్లీ :**

పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. మర్దాన్ ప్రాంతంలో పాకిస్తాన్ వైమానిక దళానికి చెందిన శిక్షణ విమానం కూలిపోవడంతో ఇద్దరు పైలట్లు మృతిచెందారు. మరో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, పాకిస్తాన్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన ఈ విమానం సాధారణ శిక్షణా కార్యక్రమంలో భాగంగా ప్రయాణం ప్రారంభించింది. కొద్ది దూరం ప్రయాణించిన తర్వాత పైలట్లు విమానంపై నియంత్రణ కోల్పోయారు. అది నేరుగా రద్దీగా ఉండే రహదారిపై కూలిపోయింది. అయితే ప్రయాణ మధ్యలో విమానానికి సాంకేతిక లోపం తలెత్తినట్లు అధికారులు భావిస్తున్నారు.
విమానం నేలను తాకిన వెంటనే భారీ పేలుడు సంభవించింది. అనంతరం మంటలు చెలరేగి, దట్టమైన నల్లటి పొగ ఆకాశాన్ని కమ్మేసింది. ప్రమాదాన్ని ప్రత్యక్షంగా చూసిన స్థానికులు ఒక్కసారిగా పెద్ద శబ్దం వినిపించిందని, వెంటనే మంటలు వ్యాపించాయని తెలిపారు. విమాన శకలాలు ప్రమాద స్థలం చుట్టుపక్కల ప్రాంతాల్లో చెల్లాచెదురుగా పడి ఉండగా, రహదారిపై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పాకిస్తాన్ హోం మంత్రి మొహ్సిన్ నఖ్వీ ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు మరణించిన విషయాన్ని అధికారికంగా ధృవీకరించారు. మృతులను కెప్టెన్ ఖాసిం, కెప్టెన్ తల్హాగా గుర్తించారు. వారి మరణంపై పాకిస్తాన్ వైమానిక దళం సంతాపం వ్యక్తం చేసింది.
ఈ ప్రమాదానికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఘటనకు గల అసలు కారణాలను తెలుసుకునేందుకు పాకిస్తాన్ వైమానిక దళం ఉన్నత స్థాయి దర్యాప్తుకు ఆదేశించింది. సాంకేతిక లోపమా, లేక ఇతర కారణాల వల్ల ప్రమాదం జరిగిందా అన్న విషయాలు విచారణ అనంతరం వెల్లడికానున్నాయి.

## అమెరికా, ఇరాన్ శాంతి ఒప్పందంపై.. పాజిటివ్ సంకేతాలు




### ● ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

**జయభేరి, న్యూఢిల్లీ :**

ప్రపంచాన్ని ఇబ్బంది పెడుతున్న, అనేక దేశాలలో ప్రాణాలు పోవడానికి దారితీసిన యుద్ధం తర్వాత.. ఈ ఒప్పందం ఒక అనుకూల చర్య అని ప్రధాని మోదీ ఒక పోస్ట్‌లో తెలిపారు. అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన అవగాహనకు ప్రధాని మోదీ సపోర్ట్ ఇచ్చారు. దీని వల్ల ప్రపంచ వాణిజ్యం చక్కగా సాగుతుందనీ, పెండింగ్ సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా, ఇరాన్ యుద్ధాన్ని ముగించేలా ఉన్న ఈ కొత్త డీల్‌ని ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం స్వాగతించారని న్యూస్18 రిపోర్ట్ చేసింది. దీని వల్ల శాంతి, స్థిరత్వం, ప్రపంచ వాణిజ్యం ఇబ్బందులు లేకుండా సాగుతుందని ఆయన భావించారు. ప్రపంచాన్ని ఇబ్బంది పెడుతున్న, అనేక దేశాలలో ప్రాణాలు పోవడానికి దారితీసిన యుద్ధం తర్వాత.. ఈ ఒప్పందం ఒక అనుకూల చర్య అని ప్రధాని మోదీ ఒక పోస్ట్‌లో తెలిపారు. "ప్రపంచ వ్యాప్తంగా తీవ్రమైన ఆర్థిక అంతరాయానికి కారణమై, అనేక దేశాలలో ప్రాణనష్టానికి దారితీసిన పశ్చిమ ఆసియాలోని సంఘర్షణను ముగించేందుకు అమెరికా, ఇరాన్‌ల మధ్య కుదిరిన అవగాహనను నేను స్వాగతిస్తున్నాను" అని ప్రధాని రాశారు. మనకు తెలుసు.. ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన సముద్ర వాణిజ్య మార్గాలలో హోర్ముజ్ జలసంధి ఒకటి. ఇరాన్ యుద్ధంతో అక్కడ సమస్య వచ్చింది. దాని వల్ల ఇండియా సహా ప్రపంచంలో చాలా దేశాలు చమురు, గ్యాస్ కొరతతో ఇబ్బంది పడుతున్నాయి. ...మిగతాది 2 లో

## సింగపూర్ ప్రధానితో సీఎం చంద్రబాబు భేటీ



### ● అమరావతి, సెమీకండక్టర్ల పై కీలక చర్చలు!

**జయభేరి, అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల సింగపూర్ పర్యటనలో భాగంగా తొలిరోజు ఆ దేశ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్‌తో ఆయన అధికారిక నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన అధికారిక నివేదికల ప్రకారం, ఇద్దరు నేతల మాధ్య ఈ ఉన్నత స్థాయి సమావేశం సుమారు 30 నిమిషాల పాటు అత్యంత సుహృద్భావ వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా రెండు దేశాలు, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్, సింగపూర్ మధ్య పరస్పర ఆర్థిక, సాంకేతిక సహకారాన్ని మరింత పటిష్టం ...మిగతాది 2 లో

## నకిలీ విత్తన ముఠా గుట్టురట్టు

...మిగతాది 3 లో

గుజరాత్‌కు చెందిన గిరీష్ పటేల్ అనే వ్యక్తి నుంచి నాసిరకం నకిలీ విత్తనాలను తెప్పించి, ఈ ముఠా జిల్లాలోని రైతులకు మాయమాటలు చెప్పి విక్రయిస్తోంది. ఈ ఏడాది 'హింద్ జాంబ్' అనే పేరుతో దాదాపు 500 నకిలీ పత్తి విత్తన ప్యాకెట్లను జిల్లాలో విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు.





## కిషన్ రెడ్డి గుంటనక్క మాయలో పడ్డారు

### ● కవిత సంచలన వ్యాఖ్యలు..!

**జయభేరి, మంచిర్యాల :**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గుంటనక్క మాయలో పడ్డారని, ఆయన లేఖ రాయగానే ఈయన ఆరా తీస్తున్నారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవిత ఎద్దేవా చేశారు. తాము సింగరేణికి వెళ్తున్నామని తెలిసే గుంటనక్క అక్కడకు వచ్చిందని పేర్కొన్నారు. ...మిగతాది 2 లో

## ప్రభుత్వ బడుల్లో అల్పాహార పథకం ప్రారంభం

### ● విద్యార్థులకు సీఎం రేవంత్ సందేశం



**జయభేరి, హైదరాబాద్, జూన్ 15 :**

వేసవి సెలవుల అనంతరం తెలంగాణ వ్యాప్తంగా సోమవారం పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. కొత్త విద్యా సంవత్సరం తొలి రోజు నుంచే రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అల్పాహార పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్రంలోని 1,269 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలు చేస్తుండగా, దీని ద్వారా సుమారు 1.44 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ పథకం కింద విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మిగిలిన మూడు రోజులు రాగి మాల్ట్ అందిస్తారు. ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులందరికీ ఈ అల్పాహారం వర్తిస్తుంది. ఇప్పటికే అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా విస్తరించినట్లు ...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## భగ్గుమన్న సీఎం రేవంత్

ఐఆర్ఎఫ్సీ నుంచి విడుదల కాలేదని చెప్పారు. హైదరాబాద్ అంతర్జాతీయ నగరమని చెప్పుకునే క్రమంలో ఆనాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, యూపీఏ చైర్పర్సన్ సోనియా గాంధీ, ఆనాటి కేంద్ర మంత్రి ఎస్ జైపాల్ రెడ్డి, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి కాలంలో మెట్రో మొదటి దశకు అంకురార్పణ జరిగిందని గుర్తుచేశారు. ఆనాడు ఢిల్లీ మెట్రోను ఆదర్శంగా తీసుకుని అంతకన్నా అద్భుతమైన రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో 2009 లో మెట్రో నిర్మాణానికి టెండర్లను పిలిచారని, ఆనాటి నుంచి 2020 నాటికి నిర్మాణం పూర్తి చేసినప్పటికీ ఫలక్ నుమా మార్గంలో నిర్మాణం పూర్తి కాలేదని చెప్పారు. చారిత్రక కట్టడాలు ఉన్నాయని, ఇతరత్రా కారణాలను చూపి పూర్తి చేయలేదని అన్నారు. మొదట్లో రూ. 15 వేల కోట్లతో ప్రారంభించిన మెట్రో పూర్తయ్యేనాటికి రూ. 22 వేల కోట్లకు చేరిందని, ఆ తర్వాత గత ప్రభుత్వంలో పదేండ్ల పాటు మెట్రో విస్తరణపై ఆలోచన చేయలేదన్నారు. ఆరోజుల్లో దేశంలో ఢిల్లీ మెట్రో మొదటి స్థానంలో ఉంటే హైదరాబాద్ మెట్రో రెండో స్థానంలో ఉండిందని, విస్తరణ చేయని కారణంగా ఇప్పుడు 9వ స్థానానికి పడిపోయిందని చెప్పారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (CURE) లో జనాభా 1.34 కోట్లకు చేరుకుందని, ఇలాంటి పరిస్థితుల్లో మెట్రో విస్తరణ తప్పక చేపట్టాలని కేంద్ర ప్రభుత్వంలో ప్రధానమంత్రిని కేంద్ర ఆర్థిక, పట్టణాభివృద్ధి, రైల్వే శాఖల మంత్రులను కలిసి ఒత్తిడి తెచ్చామని గుర్తుచేశారు. 2వ దశ విస్తరణ చేపట్టడానికి ఎల్ అండ్ టీని ఒప్పించి ఒప్పందం చేసుకోవాలని కేంద్రం సూచించిందని, అయితే ప్రతి ఏటా 350 - 400 కోట్ల రూపాయలు నష్టాలొస్తున్నాయని, ఆ నష్టాల కారణంగా 2వ దశ విస్తరణ చేపట్టలేమని ఎల్ అండ్ టీ తేల్చిచెప్పిందన్నారు. ఈ దశలో మొదటి హైదరాబాద్ మెట్రో ను రాష్ట్ర ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో విస్తరణ చేపట్టాలని మళ్లీ కేంద్రం సూచించిన నేపథ్యంలోనే ఆ దిశగా కార్యాచరణ పూర్తి చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎల్ అండ్ టీ నిరాకరించిన నేపథ్యంలోనే ప్రత్యామ్నాయంగా, ప్రజా రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలని, కాలుష్యాన్ని నియంత్రించాలన్న లక్ష్యాలతో మొదటి విడత మెట్రో ప్రాజెక్టును స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయాలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గుర్తుచేశారు. హైదరాబాద్ మహానగరంలో అన్ని వైపుల మెట్రోను విస్తరించడానికి, అన్ని రూట్లలో మెట్రో అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం రూ. 30 వేల కోట్ల విలువైన మెట్రో ప్రాజెక్టును రూ. 15 వేల కోట్లకు ఎల్ అండ్ టీ నుంచి కొనుగోలు చేసిందన్నారు. గత ప్రభుత్వంలో అనేక ప్రాజెక్టులకు 8 నుంచి 11 శాతం వడ్డీకి రుణాలను తీసుకుంటే, మెట్రో విస్తరణలో భాగంగా మెట్రో స్వాధీనం కోసం కేవలం 4 శాతం వడ్డీకి ఐఆర్ఎఫ్సీ నుంచి ఎల్ అండ్ టీకి చెల్లించాల్సిన రూ. 13,600 కోట్ల కోసం ఒప్పందం చేసుకున్నామని వివరించారు. భారత ప్రభుత్వ సంస్థ అయిన ఐఆర్ఎఫ్సీ, రైల్వే ప్రాజెక్టుల కోసం రుణాలను ఇస్తుందని చెబుతూ, మెట్రోను స్వాధీనం చేసుకోవడానికి ఆ సంస్థతో రుణ ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. అందుకోసం ఫీజు రూపేణా సంస్థకు రూ. 84 కోట్లతో పాటు ఈక్విటీగా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 1400 కోట్లను కూడా చెల్లించామని తెలిపారు. రుణ ఒప్పందానికి సంబంధించి లావాదేవీలన్నీ పూర్తయ్యాయని చెబుతూ, ఐఆర్ఎఫ్సీతో Telangana ప్రభుత్వానికి మధ్యన కుదిరిన ఒప్పందం ప్రకారం ఈరోజు నిధుల చెల్లింపు జరగాల్సి ఉండగా ఐఆర్ఎఫ్ సీ నుంచి నిధుల విడుదల ఆగిపోయిందని అన్నారు. అందుకు కారణం ఎవరని ప్రశ్నించారు. అన్ని రాష్ట్రాల్లో మెట్రో విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వం 50 శాతం నిధులు సమకూర్చుతున్న నేపథ్యంలో తెలంగాణ విషయంలో ఇలా ఎందుకు జరుగుతుందని అడిగారు. రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మెట్రో మొదటి విడతను రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేస్తే తప్ప 2వ విడత విస్తరణకు అవకాశం లేదని చెప్పారు. హైదరాబాద్ మెట్రో విస్తరణకు 50 శాతం కేంద్రం భరిస్తున్నదని వాస్తవమైతే అందుకు సంబంధించిన పత్రాలను చూపించాలని కోరారు. హైదరాబాద్‌లో రెండో దశ మెట్రో విస్తరణకు కేంద్రం 50 శాతం భాగస్వామ్యం తీసుకుంటుందా లేదంటే HMRL తరపున ప్రభుత్వం చేపట్టడానికి సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయాన్ని మరింత జటిలం చేయదలచుకోలేదని, కేంద్ర ప్రభుత్వంలో బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నందునే సమస్యను పరిష్కరించాలని కిషన్ రెడ్డిని కోరుతున్నామని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

"కేంద్ర ప్రభుత్వం సూచనలు, కేంద్ర ప్రభుత్వ నిపుణుల సలహాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని ఒక కొలిక్కి తీసుకొచ్చింది. హైదరాబాద్ నగరానికి మెట్రో విస్తరణ అత్యంత కీలకం. జరిగిన ఒప్పందాలను రాష్ట్ర ఎంపీలకు అవసరమైతే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి వివరిస్తా. ప్రజల కోసం చేస్తున్న పని. ప్రజలకు మంచి జరగాలి. సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కారం కావాలని అభిలషిస్తున్నా.." అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## ప్రభుత్వ బడుల్లో అల్పాహార పథకం

ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడం, హాజరు శాతం పెంచడం, డ్రాపౌట్లను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. 202627 రాష్ట్ర బడ్జెట్‌లో ఈ పథకాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. చాలా రోజుల తర్వాత పాఠశాలలు తెరుచుకోవడంతో విద్యార్థుల సందడి నెలకొంది. కొత్త దుస్తులు, బ్యాగులతో విద్యార్థులు ఉత్సాహంగా బడిబాట పట్టారు.పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. "పాఠశాల కేవలం పాఠాలు నేర్పే ప్రదేశం కాదు. మన వ్యక్తిత్వాన్ని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే దేవాలయం. తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని నేను గట్టిగా నమ్ముతున్నాను. అందుకే విద్యా రంగాన్ని అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు అనేక సంస్కరణలు చేపట్టాం" అని సీఎం తన సందేశంలో పేర్కొన్నారు."అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి పౌష్టికాహారం అందించడమే కాకుండా, విద్యార్థుల భవిష్యత్తు కోసం అనేక చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులు ఉత్సాహంగా చదువుకోవాలి. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో జ్ఞానాన్ని సంపాదించి, మీ కలలను సాకారం చేసుకోవాలి. విద్య అనేది ఎవరూ దొంగిలించలేని గొప్ప సంపద" అని విద్యార్థులకు సూచించారు.

## సింగపూర్ ప్రధానితో సీఎం బాబు భేటీ

చేసుకోవడంపై విస్తృతంగా చర్చించారు.సింగపూర్ ప్రధానమంత్రి కార్యాలయం మీడియా ప్రకటన ప్రకారం, ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నగర నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రధానంగా చర్చ జరిగింది. అమరావతిలో ప్రపంచస్థాయి విద్యాసంస్థలు, ఆధునిక అర్బన్ గవర్నెన్స్ (పట్టణ పరిపాలన) వ్యవస్థలను నెలకొల్పేందుకు సింగపూర్ నైపుణ్యాన్ని ఉపయోగించుకోవాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోందని సీఎంఓ వర్గాలు స్పష్టం చేశాయి. సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పుల కోసం ఏపీలో బలమైన ఎకోసిస్టమ్‌ను నిర్మించడంలో తోడ్పడాలని సింగపూర్ ప్రధానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. సింగపూర్ పీఎంఓ ఏపీ ఐటీ శాఖ నివేదికల ప్రకారం, సెమీకండక్టర్ల తయారీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), క్వాంటం కంప్యూటింగ్, వివిధ విశ్వవిద్యాలయాల పరిధిలో పరిశోధనలను ప్రోత్సహించేందుకు సింగపూర్ సహకారాన్ని సీఎం కోరారు. ముఖ్యంగా సెమీకండక్టర్ ఎకోసిస్టమ్ అభివృద్ధి, మానవ వనరుల కెపాసిటీ బిల్డింగ్‌లో సింగపూర్ భాగస్వామ్యం రాష్ట్ర యువతకు ఎంతో మేలు చేస్తుందని సీఎం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి సేద్యం ద్వారా పండిస్తున్న నాణ్యమైన ఉద్యానవన, ఆక్వా ఉత్పత్తులను సింగపూర్ దిగుమతి చేసుకోవాలని ప్రధాని లారెన్స్ వాంగ్‌ను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా కోరారు. ఏపీ వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారిక ప్రకటనల ప్రకారం, రాష్ట్రంలో పండుతున్న ఆర్గానిక్ ఉత్పత్తులకు అంతర్జాతీయ సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ సాధించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు వివరించారు. ఈ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన సింగపూర్ ప్రధాని, రెండు దేశాల మధ్య వాణిజ్య బంధాన్ని మరింత విస్తరించడానికి గల అవకాశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు సీఎంఓ వర్గాలు వెల్లడించాయి.

# టార్గెట్ టూ థర్డ్..

2024 ఎన్నికల తరువాత మోదీ ప్రభుత్వం ఇతర పార్టీలపై ఆధారపడాల్సి వచ్చింది. కానీ, గత రెండేళ్లుగా తన బలాన్ని పెంచుకోవడానికి బీజేపీ చాలా చాలా ప్రయత్నాలు చేస్తున్నది. దీర్ఘకాలంగా తమతో ప్రయాణం చేస్తున్న కొన్ని పార్టీలు, పరిస్థితులను బట్టి మారే మరికొన్ని మిత్ర పక్షాలు, రాజకీయ అవసరాలు, అంశాలవారీగా మద్దతిచ్చే పక్షాలకు దగ్గరయ్యేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తున్నది. లోక్‌సభలో ప్రస్తుతం బీజేపీకి 240 సీట్లు ఉన్నాయి.ఎన్డీయే మిత్ర పక్షాలను కలిపినా 293 సీట్లతో సాధారణ మెజారిటీ మాత్రమే ఉన్నది. మూడింట రెండొంతుల మెజారిటీ కావాలంటే 362 సీట్లు అవసరం. మూడింట రెండొంతుల మెజారిటీ లేకపోతే ఏమవుతుందో డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో బీజేపీకి అనుభవంలోకి వచ్చింది. దీంతో వివిధ పార్టీలకు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇందులో భాగంగానే 20 మంది టీఎంసీ ఎంపీలు లక్ష్యంగా ఆపరేషన్ లోటస్‌కు తెరదీసినట్టు తెలుస్తున్నది.వీరితో పాటు శిరోమణి అకాలీదళ్ కూడా బీజేపీతో జతకట్టే అవకాశం ఉంది. ఎందుకంటే, త్వరలో జరుగనున్న పంజాబ్ ఎన్నికల్లో అకాలీదళ్‌తో బీజేపీ పొత్తు పెట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే, ఈ రెండు పార్టీల సభ్యులను కలుపుకొని ఎన్డీయే బలం 318కి చేరుతుంది. ఇక తమిళనాడులో డీఎంకేను తోసిరాజని టీవీకేతో కాంగ్రెస్ జతకట్టింది. డీఎంకే గతంలోనూ ఎన్డీయేతో కలిసి పనిచేసింది.ఇటీవల ఇండీ కూటమి సమావేశానికి కూడా డీఎంకే దుమ్మా కొట్టింది. ఈ క్రమంలో డీఎంకేను బీజేపీ సంప్రదించవచ్చు. ఇక వైఎస్సార్సీపీ. టీడీపీతో ఆ పార్టీకి రాజకీయ శత్రుత్వం ఎట్లా ఉన్నప్ప టికీ, మొదటినుంచీ బీజేపీతో సత్సంబంధాలు కొనసాగుతూనే ఉన్నా యి. ఝార్ఖండ్ ముక్తి మోర్చా ఇటీ వలి కాలంలో బీజేపీకి అనుకూలంగానే మాట్లాడుతున్నది. ఎన్నిక ల్లో ఓటమి తరువాతి పరిణామాల క్రమంలో బీజేడీ నేత నవీన్ పట్నాయక్ మళ్లీ బీజేపీ వైపు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ మొదటి నుంచి కూడా కీలకమైన బిల్లుల విషయంలో మాత్రం బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తూ వస్తున్నది. ఇప్పుడు కూడా అదే వైఖరి కొనసాగించవచ్చు.ఇక శరద్ పవార్‌కు బీజేపీతో మంచి సంబంధాలే ఉన్నాయి. ప్రస్తుతానికి ఇండీ కూటమితో కలిసి ఉన్నప్పటికీ, కూతురు సుప్రియ రాజకీయ భవిష్యత్తు దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంది. పవార్‌ను బీజేపీ సంప్రదిస్తే, ఆ పార్టీకి ఉన్న 8 మంది బలం ఎన్డీయేకు చేకూరుతుంది. కాకపోతే,



టీఎంసీతో పాటు, ఎన్సీపీని విలీనం చేయాలని సోనియాగాంధీ ఇప్పటికే ఆఫర్ ఇచ్చినట్టు సమాచారం. ఇందుకు ఆ పార్టీలు ఏ మేరకు అంగీకరిస్తాయనేది చూడాలి. శరద్ పవార్‌తో పాటు డీఎంకేను తనకు అనుకూలంగా మార్చుకోగలిగితే.. బయటి నుంచి కూడా ముఖ్య బిల్లుల విషయంలోనైనా మద్దతు ఇచ్చే పార్టీల బలాన్ని కలుపుకొంటే మోదీ ప్రభుత్వ బలం దాదాపు 355కి చేరుకుంటుంది. మూడింట రెండొంతుల మెజారిటీకి ఇంకా ఏడుగురు తక్కువ వుతారు. ఇక రాజ్యసభలో మూడింట రెండొంతుల మెజారిటీ అంటే 163. బీజేపీ సొంత బలం 113, మిత్రపక్షాలను కలుపుకొంటే ఈ సంఖ్య 144కి చేరుతుంది. పది మంది టీఎంసీ సభ్యులను కలిపితే 154కి చేరుకుంటుంది. బీజేపీకి మద్దతుగా వైఎస్సార్సీపీ 7, బీజేడీ 5, ముగ్గురు ఇండిపెండెంట్లను కలిపితే 169 అవుతుంది. దీంతో రాజ్యసభలో ఎన్డీయేకు పూర్తి మెజారిటీ వచ్చినట్టే. ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యమైన బిల్లులను పాస్ చేయించు కోవ డానికి ఈ సంఖ్య చాలా కీలకమవు తుంది. ఉమ్మడి పౌరస్మృతి, డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లు, ఒకే దేశం, ఒకే ఓటు వంటి బిల్లులను ఆమోదించుకోవడానికి బీజేపీకి ఇప్పుడు నంబర్ అవసరమవుతుంది. ముఖ్యంగా లోక్‌సభలో మెజారిటీ కోసం బీజేపీ పెద్దలు చాలా జాగ్రత్తగా పావులు కదుపు తున్నారు.మరో వైపు ఈసీ కూడా భారత ఎన్నికల సంఘం కేంద్ర పాలకపక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తూ, గత 12 ఏళ్లుగా ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి జేబుసంస్థగా మారిందనే ఆరోపణలు, విమర్శలు అనేకం. స్వతం త్ర ప్రతిపత్తి గల ఈ రాజ్యాంగ సంస్థ పక్షపాతంతో అధికారంలో ఉన్న బీజేపీకి వంతపాడు తున్నదని ప్రజాసం ఘాలు, ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అధికార పార్టీకి అనుకూలంగా లక్షల ఓట్లు తొలగించి విపక్షాల ఓటమికి కారణమైందనే ఆరోపణలు ఈ మధ్యకాలంలో మిన్నంటుతున్నాయి. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పక్కనపెట్టి, ఎలక్షన్ల కమిషనర్లను ఎంపిక చేసే కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తిని తప్పించి, కేంద్ర ప్రభుత్వం కొత్త గా తీసుకువచ్చిన చట్టం ఏకపక్షంగా ఉండటంతోనే ఎన్నికల కమిషన్ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నదనే విమర్శ కూడా ఉంది. ఇటీవల మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు పోటీచేసిన తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను ఎన్నికల సంఘం తిరస్కరించింది.అయితే, ఈ క్రమంలో ఈసీ వ్యవహరించిన తీరు పై అనుమానాలు రాక మానదు. ఎన్నికలు నిస్సందేహం గా, నిష్పక్షపాతంగా జరగాలి. ఎన్నికల పవిత్రతను కాపాడాల్సిన అంతిమ బాధ్యత ఎన్నికల సంఘంపైనే ఉం టుంది. కానీ, కంచె చేను మేసిందన్నట్లుగా ఎన్నికల సం ఘం నిర్ణయం ఉన్నది. నిజంగానే అభ్యంతరాలు ఉంటే వివరణ కోరాల్సింది. అయితే, ఎన్నికల కమిషన్ అలా చేయలేదు. తెలంగాణలో ఎలాంటి ఎఫ్ఐఆర్ లేకుండా, మీనాక్షికి సంబంధం లేని కేసులో వచ్చిన నోటీసులను సాకు చూపి నామినేషన్ తిరస్కరించడం సబబు కాదు. ఈ తతంగం వెనుక బీజేపీ ఉందనే ప్రచారం జరుగుతున్నది.మొన్నటికి మొన్న తమిళనాడులో గవర్నర్ అవలంబించిన తీరు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆందోళన కలిగించింది. అక్కడ ప్రజలు ఎన్నుకున్న అతిపెద్ద పార్టీని ప్రమాణస్వీకారానికి పిలువకుండా, రెండు రెండు ఆరు అన్నట్లుగా గవర్నర్ వ్యవహారశైలి ఉన్నది. బీజేపీ ఏజెంట్‌గా వ్యవహరించి తన సీటు గౌరవాన్ని తగ్గించారు. గవర్నర్‌కు సొంతంగా నిర్ణయాలు తీసుకునే అధికారం చాలా పరిమితమని తెలిసి కూడా కర్రపెత్తనానికి ఒడిగట్టారు. రాజ్యాంగ పరిషత్ చర్చల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గవర్నర్ల పాత్రను చాలా స్పష్టంగా వివరించారు.బ్రిటిష్ పార్లమెంటరీ విధానంలోని 'ది కింగ్ కెన్ డూ నో రాంగ్' అనే సూత్రం తెలిసినట్టుగా లేదు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం చూసినా తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్‌కు ముఖ్యమంత్రిగా మొదటి అవకాశం ఇవ్వాలి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 164(1) ప్రకారం, అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏ ఒక్క పార్టీకి లేదా కూటమికి స్పష్టమైన మెజారిటీ రానప్పుడు, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అతి పెద్ద పార్టీ నాయకుడిని ఆహ్వానించే విచక్షణాధికారం గవర్నర్‌కు ఉంటుంది.అయితే, ఎమ్మెల్యేల సంతకాలు ముందే కావాలని గవర్నర్ పట్టుబట్టారు. ఇది ముమ్మాటికీ గతంలో ఎన్నడూ లేని కొత్త నిబంధనలను సృష్టించడమేనని న్యాయ నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ తతంగాన్ని చూశాక గవర్నర్ వ్యవస్థ అనేది కేంద్ర ప్రభుత్వం చేతుల్లో పావుగా మారిందని అందరికీ అర్థమైపోయింది. మెజారిటీ ఉందో, లేదో తేల్చాల్సింది లోక్‌భవన్ గదుల్లో కాదు కదా? ఈ ప్రాథమిక సూత్రాన్ని విస్మరించి విజయ్ వద్ద మ్యాజిక్ ఫిగర్ లేదని సాకు చూపుతూ ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించక, ప్రజా తీర్పును లోక్‌భవన్ అవమానించింది. అసెంబ్లీ వేదికగా మాత్రమే బలనిరూపణ జరగాలని సుప్రీంకోర్టు గతంలో పలు తీర్పుల్లో స్పష్టం చేసిన విషయాన్ని మరువరాదు.




## కిషన్ రెడ్డి గుంటనక్క మాయలో పడ్డారు

గుంటనక్క లేఖ రాయగానే బొగ్గు బ్లాక్ ల గురించి కిషన్ రెడ్డి ఆరా తీస్తున్నారని, కానీ అది ఎప్పుడో జరిగిందని, తాము వస్తున్నామని తెలిసి ఇప్పుడు లేఖ రాశారని అన్నారు. అయితే మాజీ మంత్రి హరీష్ రావును ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. టిఆర్ఎస్ సింగరేణి బాయిబాట కార్యక్రమంలో భాగంగా కవిత మంచిర్యాల జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడుతూ పలు వ్యాఖ్యలు చేశారు. కిషన్ రెడ్డి ఈ భూమి పుత్రుడైతే తెలంగాణకు ఎక్కువ బ్లాక్ లు వచ్చేలా ప్రయత్నం చేయాలని, సింగరేణికి మేలు చేయాలని అన్నారు. ప్రస్తుతం సింగరేణిలో చాలా మంది కార్మికులను తగ్గించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఓపెన్ కాస్ట్ అంటూ కార్మికులను తగ్గించాలని ప్రయత్నిస్తున్నారని, కానీ భూగర్భ గనుల ద్వారా ఇంకా ఎక్కువ బొగ్గును ఉత్పత్తి చేయవచ్చని, యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కూడా కల్పించవచ్చని అన్నారు. కానీ సింగరేణిలో కార్మికులకు కనీసం సౌకర్యాలు కూడా కల్పించటం లేదని, సింగరేణిలో అధికారులకు ఒక న్యాయం, కార్మికులకు ఒక న్యాయం అన్నట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. జీఎం చేసే పనులను సీఎం, క్లర్క్ చేసే పనులను డిప్యూటీ సీఎం చేస్తున్నారని, న్యాయం చేయగలిగే పరిస్థితుల్లో ఉండి ప్రతిపక్షాల మాదిరిగా కార్మికుల దగ్గరకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి కారణంగానే సింగరేణి సంస్థ నష్టపోతోందని, కార్మికులను తీవ్రంగా ఇబ్బంది పెడుతూ సంస్థను ప్రైవేట్ పరం చేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కార్మికుల హక్కులను హరిస్తూ వారిపై శాడిజం చూపిస్తున్నారని, సింగరేణి కార్మికులకు సరైన వసతులు కల్పిస్తే వారు బంగారం పండిస్తారని అన్నారు. ప్రతి గని లో పరిస్థితిని తాము గమినించామని, . కార్మికులకు చాలా ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులతో వెట్టి చాకిరి చేయించటం సరికాదన్నారు. సింగరేణిలో ప్రతి శనివారం ఉద్యోగాల జాతర జరగాలి, కానీ ఇక్కడ ఎంత మందిని సస్పెండ్ చేద్దామా అని లెక్కలు వేస్తున్నారని, ప్రభుత్వం అలసత్వం కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సింగరేణికి ఇవ్వాల్సిన బకాయిలు అన్ని ఇచ్చేసి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. ఈ ప్రభుత్వం సింగరేణికి బకాయి ఉన్న మొత్తం అప్పు కట్టాలని, నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 33 వేల కోట్ల ఆదాయం ఇచ్చే సంస్థ కళ్లముందే పాడవుతుంటే చాలా బాధగా ఉందని కవిత అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అవినీతి కారణంగానే సింగరేణి సంస్థకు నష్టం జరుగుతోందని విమర్శించారు. సింగరేణి హక్కులను కాపాడేది హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ మాత్రమేనని ఈ సందర్భంగా కవిత స్పష్టం చేశారు. సింగరేణి కార్మికులకు సొంత ఇల్లు ఉండాల్సిన అవసరం ఉందని, అందుకోసం ప్రభుత్వం వారికి 250 గజాల స్థలం ఇవ్వాలని అన్నారు. లేదంటే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి కార్మికులకు ఇళ్లు కట్టుకునేందుకు 250 గజాల స్థలం ఇస్తామని హామి ఇచ్చారు. యువతకు రెండు లక్షల నుంచి 20 కోట్ల వరకు రుణాలు ఇచ్చి సింగరేణిలో మెషీన్లు రిపేర్ చేసే పరిశ్రమ పెట్టుకునేలా చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో నిర్వహించిన టిఆర్ ఎస్ జెండా పండుగలో కవిత పాల్గొని పార్టీ జండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇస్తామన్న ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. పెన్షన్ పెంచలేదని, రైతుల వడ్లు కొనటం లేదని, వారిని ఇబ్బంది పెడుతోందని అన్నారు. ఈ కర్కోటపు కాంగ్రెస్ ప్రభుత్వంపై మనమంతా పోరాడాల్సిన సమయం వచ్చిందని అన్నారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వచ్చాక ఉచిత విద్య, వైద్యం అందిస్తామని స్పష్టం చేశారు. యువతకు 2 లక్షల నుంచి 20 కోట్ల రూపాయల వరకు ఋణాలు అందిస్తామని, వారికి ఉద్యోగాలు వచ్చేలా అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులకు టీఆర్ఎస్ ప్రభుత్వంలో గౌరవం ఉంటుందని, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో రైతుల కోసం ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

## పాజిటివ్ సంకేతాలు

ఈ సమస్యల్ని తొలగించి, అంతర్జాతీయ వాణిజ్యాన్ని రక్షించాలనే విషయాన్ని ప్రధాని మోదీ నొక్కి చెప్పారు. "ఈ డీల్ అమలు గల్ఫ్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికీ, నౌకాయాన, వాణిజ్య స్వేచ్ఛను తిరిగి తేవడానికి సహాయపడుతుందని భారతదేశం ఆశిస్తోంది" అని మోదీ పోస్టులో తెలిపారు. కొన్ని నెలలుగా పరిష్కారం కాని సమస్యలపై చర్చలు ఇప్పుడు శాశ్వతంగా పరిష్కారం కావచ్చని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. "మిగిలిన సమస్యలపై చర్చలు ఒక సుస్థిరమైన తుది ఒప్పందానికి దారితీస్తాయని మేము ఆశిస్తున్నాము" అని ప్రధాని మోదీ జోడించారు. తమ యుద్ధాన్ని ముగించి, ప్రపంచ చమురు, గ్యాస్ రవాణాకు కీలక మార్గమైన హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి ఉద్దేశించిన ఒక ఒప్పందానికి వచ్చినట్లు అమెరికా, ఇరాన్ అధికారులు ప్రకటించిన తర్వాత ప్రధానమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఒప్పందం ఇంకా ప్రాథమిక స్థాయిలోనే ఉన్నప్పటికీ, ఫిబ్రవరిలో ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ కలిసి చేసిన దాడుల తర్వాత ఈ డీల్.. యుద్ధాన్ని ముగిస్తుందనే అంచనాల్ని పెంచింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ప్లాట్‌ఫామ్‌లో దీని గురించి రాశారు. "ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది" అని రాశారు. ఈ చర్చలలో మధ్యవర్తిగా వ్యవహరించిన పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, ఒక ఒప్పందం కుదిరిందని చెప్పిన కొద్ది సేపటికే ఈ ప్రకటన వచ్చింది.


రాయిటర్స్ ప్రకారం, ఈ అవగాహనా ఒప్పందంపై జూన్ 19, శుక్రవారం నాడు స్విట్జర్లాండ్‌లో లాంఛనంగా సంతకాలు చేయనున్నారు. ఈ ఒప్పందానికి సంబంధించిన అనేక వివరాలు ఇంకా బహిరంగపరచనప్పటికీ, "లెబనాన్ సహా అన్ని రంగాలలో సైనిక కార్యకలాపాలను తక్షణమే, శాశ్వతంగా నిలిపివేయాలని" ఈ ఒప్పందం పిలుపునిస్తుందని షరీఫ్ చెప్పారు. లెబనాన్ సహా అన్ని రంగాలలో సైనిక కార్యకలాపాలు సోమవారం రాత్రి నుంచి శాశ్వతంగా ముగుస్తాయని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కూడా తెలిపింది. డీల్‌లో భాగంగా 60 రోజుల కాల్పుల విరమణ కాలంలో ఆంక్షల సడలింపు సహా విస్తృత సమస్యలపై చర్చలు జరుపుతామని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెమ్ గరీబాబాది తెలిపారు. ఐతే.. ఇరాన్ అణు కార్యక్రమం పరిష్కారం కాని ప్రధాన సమస్యలలో ఒకటిగా మిగిలిపోయింది. నెక్స్ట్ చర్చల సందర్భంగా రెండు పక్షాలు ఈ సమస్యను పరిష్కరించుకుంటాయని రాయిటర్స్ రిపోర్ట్ చేసింది.

# సీఎం రేవంత్ భారీ పొలిటికల్ స్కెచ్

జయభేరి, హైదరాబాద్ :




రాష్ట్ర ప్రభుత్వం మార్చి 16 నుంచి జూన్ 12 వరకు చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంతో ప్రజా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 99 రోజుల పాటు రాష్ట్రమంతటా జరిగిన కార్యక్రమాలపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. విభాగాల వారీగా చేపట్టిన కార్యక్రమాలు, వాటి ద్వారా వచ్చిన ఫలితాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాజ్యసభ ఎంపీ, CS కె. రామకృష్ణారావు, DGP సీవీ ఆనంద్ తో పాటు , వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా విభాగాలు జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు చేపట్టిన కార్యక్రమాల వివరాలపై నివేదికలను సమర్పించాయి. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో చురుగ్గా పాల్గొన్న విభాగాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ప్రధాన కార్యదర్శుల నుంచి జిల్లా కలెక్టర్ వరకు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతినెలా క్షేత్రస్థాయికి వెళ్లాలని గతంలో ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లని అధికారులు, జిల్లా కలెక్టర్లపై తనకు నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. వివిధ స్థాయిల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ ను నమోదు చేయాలని, గ్రామాల్లో వచ్చిన సమస్యలను కూడా ఆయా శాఖలు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ 3 నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, చేసిన శంకుస్థాపనలు, ఆస్తుల వివరాలన్నీ నమోదు చేయాలని చెప్పారు. ఇప్పటికీ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ భవనాలు లేని గ్రామాలుంటే.. వెంటనే ఆ జాబితాను సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. అక్కడ కొత్తగా గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలను కూడా చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. అన్ని పాఠశాలల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యా, వైద్య విభాగాల్లో అన్ని స్థాయిల్లో ఫేషియల్ రికగ్నిషన్ విధానం అమలు చేయాలని స్పష్టం చేశారు. పాఠశాలల నుంచి కాలేజీల వరకు, పీహెచ్‌సీ నుంచి ఉస్మానియా, గాంధీ ఆసుపత్రి వరకు ఉద్యోగులందరికీ ఇదే అటెండన్స్ విధానం పాటించాలన్నారు. రాష్ట్రస్థాయిలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష నిర్వహించినట్లే, జిల్లాల వారీగా వెంటనే సమీక్ష జరపాలని ఆదేశించారు. ఈ సమీక్షలకు రాష్ట్ర స్థాయి నుంచి ప్రతి జిల్లాకో సీనియర్ ఐఏఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించి, ఆ జిల్లాకు పంపించాలని చెప్పారు. జిల్లాల వారీగా ఈ ప్రగతి నివేదికలను విడుదల చేయాలని చెప్పారు. జిల్లాలతో పాటు నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుకున్న లబ్ధిదారులు, ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వీటిని డ్యాష్ బోర్డులో అందుబాటులో ఉంచాలని చెప్పారు. తాను ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత జిల్లాల పర్యటనలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ముఖ్యమంత్రి అధికారులను ఆరా తీశారు. నియోజకవర్గాల వారీగా ముఖ్యమంత్రి హామీల పురోగతిపై నివేదిక ఇవ్వాలని ప్రణాళికా విభాగాన్ని ఆదేశించారు.



## ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి జన్మదిన శుభాకాంక్షలు

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 14 :

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హైదరాబాద్ లోని ప్రగతి భవన్ లో మర్యాద పూర్వకంగా ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తూ తెలంగాణ రాష్ట్ర ప్రగతికి విశేష కృషి చేస్తున్న నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని పేర్కొన్నారు. భట్టి విక్రమార్క ఆయురారోగ్యాలతో, ఆనందంగా,దీర్ఘాయుష్షుతో ఉండాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించి, అభివృద్ధికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు.

## మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు



జయభేరి, తుర్కపల్లి, జూన్ 15 :

తుర్కపల్లి మండలం పల్లెపహాడ్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సోక్కుల మోహన్ రెడ్డి తల్లి సొక్కుల యశోదమ్మ మరణించడంతో ఆయన కుటుంబాన్ని పలువురు నాయకులు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా యశోదమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు సోక్కుల బాల్ రెడ్డి, సోక్కుల పాపిరెడ్డి, సోక్కుల భాస్కర్ రెడ్డి లను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గ్రామ సర్పంచిగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ సి పి ఎల్ చైర్మన్ సమీర్ సర్వయ్య, వైస్ ప్రెసిడెంట్ రాధాకృష్ణన్, రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచులు సింగం వెంకటేశం, గుంటి శ్రీశైలం, బూత్కూరి నరసింహారెడ్డి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు మాధవరెడ్డి టీజేయు జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎండి యూసఫ్, ముక్తార్ పాషా, బట్టు శ్రీనివాస్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


## రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు



జయభేరి, తుర్కపల్లి, జూన్ 15 :

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలైన సంఘటన తుర్కపల్లి మండలం పల్లె పహాడ్ గ్రామ స్టేజ్ వద్ద సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తుర్కపల్లి మండలం గొల్లగూడెం గ్రామం నుండి యాదగిరి పల్లి కి వెళ్తున్న ఆటో లో వెళ్తున్న మిట్ట మాధవి, జదేవ్‌పూర్ నుండి భువనగిరికి వస్తున్న లారీ ఒక్కసారిగా ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని 108 వాహనంలో గవర్నమెంట్ హాస్పిటల్ కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం



జయభేరి, తుర్కపల్లి, జూన్ 15 :

పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్ అన్నారు. సోమవారం తుర్కపల్లి మండలం రుస్తాపురం గ్రామ శాఖ అధ్యక్షునిగా నీల సునీల్, చౌక్ల తండా అధ్యక్షునిగా భూక్య పిక్లా నాయక్, పెద్దతండ అధ్యక్షునిగా తేజావత్ నరేష్ నాయక్, మోతీరామ్ తండా అధ్యక్షుడిగా ధరావత్ విజయ నాయక్, పల్లె పహాడ్ సర్పంచ్ గా దాసరి సద్గురును ఏకగ్రీవంగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విప్పు బీర్లు ఐలయ్య నాయకత్వంలో పార్టీకి కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని, అభివృద్ధి పనులను సంక్షేమాలను ప్రతి పేదోడికి చేరేలా కృషి చేయాలని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షుడు ధనావత్ భాస్కర్ నాయక్, బీసీ సెల్ జిల్లా కోఆర్డినేటర్ దేవరుప్పల ఐలయ్య, సర్పంచుల ఫోరం జిల్లా ప్రచార కార్యదర్శి భూక్య రాజారాం నాయక్, సర్పంచులు బానోతు విజయ బాబు నాయక్, పాంగల పవనీత బాలకృష్ణ, మండల ఉపాధ్యక్షులు పని గట్ల సుదర్శన్ గౌడ్, మండల నాయకులు ధరావత్ సురేష్ నాయక్, మారగోని శ్రీరామ్ మూర్తి గౌడ్, ఉప సర్పంచ్ దిరావత్ రాజు నాయక్, వంగరి ప్రసాద్, భానోతు వినోద్ నాయక్, ధనావత్ రాములు నాయక్, బుజ్జి వెంకటేష్, జాగిల్లపురం సతీష్, సుగ్రీవ చారి, మంత్రి బలరాం, దాసరి శ్రీశైలం, పత్తేపురం మహేందర్, బూడిద రాములు గౌడ్, బానోతు శీను నాయక్, జితేందర్ నాయక్, తిరుపతి నాయక్ పాల్గొన్నారు.




## ప్రవేట్ బడుల్లో ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం సిద్ధం

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

జయభేరి, దేవరకద్ర :

ప్రవేట్ బడుల్లో ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం సిద్ధమవుతుందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దీంతో ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీకి చెక్ పడనుందన్నారు. ఈ విషయంలో ప్రతిపాదన సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించడం జరిగిందన్నారు. నిబంధనలు కఠినంగా ఉండాలని సూచించారన్నారు. మొత్తం పాఠశాలలను కేటగిరీలుగా విభజించే యోచనలో ప్రభుత్వం ఉందన్నారు. ఆ ప్రకారమే నిర్దిష్ట ఫీజుల ఖరారు కాబోతుందన్నారు. ఈనెల నుండే ఈ నిబంధనలు అమలయ్యే అవకాశం ఉందని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు.

## కాశీ విశ్వనాథుడికి ఘనంగా పూజలు



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారి దేవస్థానంలో సోమవారం అమావాస్య సందర్భంగా కాశీ విశ్వనాథ స్వామి కి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష దృవ్యంతో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం పూజ కార్యక్రమాన్ని దేవస్థానం అర్చకుడు తరిమల హరిశంకర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాఠశాలలో ఉపాధ్యాయులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండల వనరుల కేంద్రంలో సోమవారం ఎంపీ యూపీఎస్ జీనగరాల, పెద్ద రాజమూర్, బస్వాయిపల్లి పాఠశాలల ఉపాధ్యాయులకు ఎంఈఓ బలరాం ఉచిత పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలలో ఉపాధ్యాయులు శంకర్, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర చారి, భీంపల్లి శ్రీకాంత్, విద్యాధర రెడ్డి, అశోక్ కుమార్, ఖాజమైనుద్దీన్ సిఆర్పి రాధిక తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తన ముఠా గుట్టురట్టు

- ఐదుగురు అరెస్ట్, రూ.20 లక్షల ముడిసరుకు స్వాధీనం

జయభేరి, ఆదిలాబాద్ :



గుజరాత్‌కు చెందిన గిరీష్ పటేల్ అనే వ్యక్తి నుంచి నాసిరకం నకిలీ విత్తనాలను తెప్పించి, ఈ ముఠా జిల్లాలోని రైతులకు మాయమాటలు చెప్పి విక్రయిస్తోంది. ఈ ఏడాది 'హింద్ జాంబ్' అనే పేరుతో దాదాపు 500 నకిలీ పత్తి విత్తన ప్యాకెట్లను జిల్లాలో విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. జిల్లాలో అమాయక రైతులను ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న ఒక అంతరాష్ట్ర ముఠా గుట్టును ఆదిలాబాద్ పోలీసులు రట్టు చేశారు. ఈ ముఠాకు చెందిన తొమ్మిది మందిపై కేసులు నమోదు చేయగా, వారిలో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి సుమారు రూ.20 లక్షల విలువైన 782 విత్తన బ్యాగులు, ఒక కారు, ప్యాకింగ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

**సూత్రధారులు - పాత్రధారులు**

ఈనాడు కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని చిల్లర్ గంజ్కు చెందిన విత్తనాల పంపిణీదారు సందేశ్ బండేవార్, హైదరాబాద్ కొత్తపేట నివాసి పడిన్వార్ సునీల్‌కుమార్, మహారాష్ట్రకు చెందిన రాథోడ్ పండిత్, రాథోడ్ బాలాజీ, కృష్ణ, గుజరాత్‌కు చెందిన గిరీష్ పటేల్, ఇచ్చోడ మండలం దాబా(కె) కు చెందిన ఈశ్వర్, గణేశ్, ఉట్నూరు మండలం హస్నాపూర్‌కు చెందిన కిరణ్‌లు ఒక ముఠాగా ఏర్పడ్డారు. గతంలో వివిధ విత్తన కంపెనీల్లో పనిచేసిన అనుభవం ఉన్న సునీల్‌కుమార్.. 'నిఖిత ఆగ్రోటెక్', 'జెనిసన్ బయో సైన్సెస్' అనే పేర్లతో నకిలీ వ్యాపారాన్ని ప్రారంభించాడు.

**నకిలీ విత్తనాల గుట్టు రట్టయిందిలా**

గుజరాత్‌కు చెందిన గిరీష్ పటేల్ అనే వ్యక్తి నుంచి నాసిరకం నకిలీ విత్తనాలను తెప్పించి, ఈ ముఠా జిల్లాలోని రైతులకు మాయమాటలు చెప్పి విక్రయిస్తోంది. ఈ ఏడాది 'హింద్ జాంబ్' అనే పేరుతో దాదాపు 500 నకిలీ పత్తి విత్తన ప్యాకెట్లను జిల్లాలో విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. ఇటీవల ఆదిలాబాద్ పట్టణంలోని కాన్సల్ బస్టాండ్ వద్ద రాథోడ్ పండిత్, రాథోడ్ బాలాజీలు అనుమానాస్పదంగా విత్తన సంచులతో తిరుగుతుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా వచ్చిన సమాచారంతో ముఠాలోని మరికొంత మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు తమ నేరాన్ని అంగీకరించడంతో వారి వద్ద నుంచి పత్తి విత్తనాల బ్యాగులతో పాటు ఎలాంటి అనుమతులు లేని బయో మైక్రోఫుడ్ ప్యాకింగ్ సామగ్రి, ముడి సరుకును స్వాధీనం చేసుకున్నారు.

**రిమాండ్‌కు నిందితులు**

ఈ నకిలీ విత్తనాల వ్యవహారంలో కీలక నిందితులైన సునీల్‌కుమార్, రాథోడ్ పండిత్, రాథోడ్ బాలాజీ, గిరీష్ పటేల్, ఈశ్వర్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. రైతులు నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని, గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా పోలీసులు సూచించారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలి

జయభేరి, తుర్కపల్లి, జూన్ 15 :



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ అన్నారు. సోమవారం తుర్కపల్లి మండలం వాసాలమర్రి, కొండాపురం గ్రామాల్లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తో కలిసి ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలైన పూరి గుడిసెల్లో, బేరా, రేకుల షెడ్డు ఇండ్లలో నివసించే వారిని గుర్తించి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై హౌసింగ్ అధికారులతో మాట్లాడుతూ మండలంలో ఇందిరమ్మ ఇండ్లు ఎన్ని మంజూరు అయ్యాయని అందులో ఎన్ని పూర్తయ్యాయని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి పురోగతిలో ఉన్న ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో అధికారులు కృషి చేయాలని అన్నారు. జిల్లాలోని అన్ని నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో పూర్తయ్యల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా క్షేత్రస్థాయిలో అధికారులు కృషి చేయాలని జిల్లాలోని అన్ని నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో పూర్తయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని అన్నారు. గృహప్రవేశాల పురోగతిని త్వరగా పూర్తిచేయాలని రెండో విడత లబ్ధిదారుల ఎంపిక నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. మండలంలోని నిరుపేదలైన పూర్తి గుడిసెల్లో, డేరా, రేకుల షెడ్డులో నివసించే వారిని గుర్తించి అర్హులైన వారికి ఇందిరమ్మలను మంజూరు చేయాలని అన్నారు జిల్లా కలెక్టర్ అనురాగ జయంతి మాట్లాడుతూ ఇందిరమ్మండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులను సూచించారు. పూరి గుడిసెల్లో, డేరా రేకుల, షెడ్డులో నివసిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లెంకల గీతారెడ్డి. హౌసింగ్ డిఇ శ్రీరాములు, హౌసింగ్ ఏఈ నరేష్, గ్రామ సర్పంచులు దొమ్మాట అనురాధ బాబు, శివరాత్రి లావణ్య జహంగీర్, మాజీ సర్పంచ్ సింగం వెంకటేశం, ఏపీవో నారాయణ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



# సిఐటియు ఆధ్వర్యంలో శ్రీశ్రీకి ఘన నివాళులు

జయభేరి, పరవాడ:

మండలంలో తాడి గ్రామంలో శ్రీ శ్రీ 43వ వర్ధంతి సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీశ్రీ చిత్రపటానికి సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎస్ వెంకటలక్ష్మి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఫార్మాసిటీ స్టాప్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియుగౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీరంగం శ్రీనివాసరావు విశాఖ పట్నంలో జన్మించి ప్రపంచంలోనే ఒక ప్రముఖ కవిగా గుర్తింపు పొందడం గొప్ప విషయం అన్నారు. సముద్రపు కెరటాలు కష్టాలకు ఎదురొడ్డి పోరాడాలని మహాకవి శ్రీశ్రీ తమ కవితల్లో వివరించేవారన్నారు. కార్మిక లోకాన్ని కదం తొక్కించారన్నారు. విప్లవ కవిగా గుర్తింపు గుర్తింపు పొందడంతో పాటు సినిమా పాటలు మాటలు ఎన్నో రాశారన్నారు .ప్రాథమిక విద్య విశాఖపట్నంలో మద్రాస్ లో బిఏ పూర్తి చేసి ఆంధ్రప్రభ, ఆంధ్ర వాణి రేడియో కేంద్రాల్లో ఎన్నోసినిమా పాటలు మాటలు రాశారన్నారు. వస్తున్నాయి వస్తున్నాయి జగన్నాథ రథచక్రాలు వంటి కవితలతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన మహాకవి శ్రీశ్రీ అన్నారు. అమెరికా , రష్యా 70 మంది కవులు రాసిన వివిధ కవితలను తెలుగులోకి అనువదించారన్నారు. తెలుగు వీర లేవరా అంటూ అనేక సినిమా పాటలు 1500 వరకు రాశారన్నారు. అభ్యుదయ విప్లవ రచయితల సంఘాన్ని 1970లో ఏర్పాటు చేయడంలో శ్రీ శ్రీ కీలక పాత్ర పోషించారన్నారు. వలస కార్మికులు పొట్టకూటి కోసం ఏ రకంగా వలస పోతారు ఆయన కవితల్లో వివరించారన్నారు. సమ సమాజ నిర్మాణం కోసం నేను సైతం అంటూ అనేక కవితలు రచించిన మహనీయుడు శ్రీ శ్రీ అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కుమారి, వలస కార్మికుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సాహో, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.





## శ్రీ లక్ష్మీ స్టోన్స్ వర్కర్స్ కోఆపరేటర్ సొసైటీ మండల అధ్యక్షులుగా రవీందర్ నాయక్

జయభేరి, తుర్కపల్లి, జూన్ 15 :

తుర్కపల్లి మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీ లక్ష్మీ బాలాజీ స్టోన్స్ వర్కర్ కోఆపరేటర్ సొసైటీ అధ్యక్షులు ధరావత్ రవీందర్ నాయక్, ఉపాధ్యక్షుడుగా గూగుల్ దాసు, సహాయ కార్యదర్శులుగా రామావత్ సురేందర్, బానోత్ రాజేందర్ నాయక్, కోశాధికారి నునావత్ రవీందర్ నాయక్ ను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులు బానోత్ శివ, భానోత్ హిరాలాల్, బానోతు దేవ, బానోతు రవి, గుగులోత్ శంకర్, హీరాలాల్, కిషన్, శీను, రమేష్, చందు, ఆవుల రాజు, చంటి, భాస్కర్, రాజేందర్ మెగ్యా, ఉపేందర్, భూక్య శ్రీను, దిరావత్ రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ధరావత్ రవీందర్ మాట్లాడుతూ గ్రానైట్ , టైల్స్, మార్బుల్, తాండూర్ వంటి బండలు వేసే పనులు స్థానికులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ స్టోన్స్ వర్కర్స్ కోఆపరేటర్ సొసైటీ మండల నాయకులకు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దరాజమూర్ లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం పెద్ద రాజమూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠ్యపుస్తకాలతో పాటు విద్యార్థులకు నోటుబుక్కులను కూడా ఉపాధ్యాయులు అందజేశారు. పాఠశాల ప్రారంభోత్సవ దినం సందర్భంగా పాఠశాలను మామిడి ఆకుల తోరణాలు, బెలూన్సులతో అలంకరించి ఘనంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. అలాగే విద్యార్థులకు పాటలు, పాటలు తదితర కార్యక్రమాలను కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఎంతో చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఉపాధ్యాయులు శంకర్, వెంకటేశ్వర్లు లతోపాటు ఆయా తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్న వడ్డేమాన్ సర్పంచ్ కు అభినందనల వెల్లువ

- 10 ఏళ్ళ మురికి నీటి సమస్యకు పరిష్కారం
- సమస్య తెలిసిన వెంటనే స్పందించిన సర్పంచ్ వట్టెం స్వప్న శివకుమార్



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్నచింతకుంట మండలం చిన్న వడ్డేమాన్ లో సర్పంచ్ ప్రత్యేక చొరవతో పదేళ్ల సమస్యకు పరిష్కారం దొరికింది. స్థానిక ఎస్సీ వాడలో నిల్వ ఉన్న మురికి నీటి సమస్యను గ్రామస్తులు స్థానిక సర్పంచ్ వట్టెం స్వప్న శివకుమార్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సర్పంచ్ వెంటనే స్పందించారు. గ్రామస్తులు అంటువ్యాధి రోగాల బారిన పడకుండా క్షేత్రస్థాయిలో ఆ సమస్యను పరిశీలించారు. గ్రామీణాభివృద్ధి బాధ్యతను దృష్టిలో పెట్టుకొని వెంటనే ఎస్సీ వాడలో నిల్వ అయిన మురికినీటి సమస్యను పరిష్కరించారు. అక్కడ నాగుల కాల్వ పూడిక తీయించడంతో ఆ సమస్య పరిష్కారమైంది. దీంతో గ్రామస్తులు సర్పంచ్ వట్టెం స్వప్న శివకుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వినోద్, గ్రామ అధ్యక్షుడు అమరేష్, యూత్ అధ్యక్షుడు ప్రిన్స్, బిఎల్ఏ దయానంద్, గ్రామ పెద్దలు ఏ.రాజు, దావీదు, సుదర్శన్, చందు, ఎస్.వెంకటేష్, మహేందర్, జార్జి తదితరులు పాల్గొన్నారు.

## సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో దొంగల బీభత్సం

- కాల్పులు జరిపిన పోలీసులు

జయభేరి, గుంటూరు, జూన్ 15 :

తమిళనాడులోని చెంగల్‌పట్టు నుంచి కాకినాడ పోర్ట్‌కు వెళుతున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలులో దోపిడీకి యత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు కాల్పులు జరపడంతో కలకలం రేపింది. అర్ధరాత్రి దాటాక 1.15 గంటల ప్రాంతంలో పల్నాడు జిల్లా బాపట్ల శివారు నల్లమడ వాగు రైల్వే వంతెన సమీపంలో ఈ దోపిడీ యత్నం జరిగింది. సర్కార్ ఎక్స్ ప్రెస్ రైళ్లోని ఎస్3, ఎస్6 బోగీల్లో నిద్రిస్తున్న ఇద్దరు మహిళల నుంచి బంగారు ఆభరణాలు దొంగిలించి పోయారు.

# రోహింగ్యా ముస్లింలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

- కావేరి శ్రీధర్ ముదిరాజ్

జయభేరి, మేడ్చల్ :




మేడ్చల్ సర్కిల్ గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలో అధికారిక గుర్తింపు పత్రాలు లేకుండా అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యా ముస్లింలను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ గుండ్లపోచంపల్లి డివిజన్ అధ్యక్షుడు కావేరి శ్రీధర్ ముదిరాజ్ కోరారు. ఈ మేరకు సోమవారం పేట్ భాషిరాబాద్ పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కావేరి శ్రీధర్ మాట్లాడుతూ గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని పలు నిర్మాణ సంస్థలు, లేబర్ క్యాంపులు, అద్దె గృహాలలో స్థానిక ముస్లింల గుర్తింపుతో కొందరు అనుమానాస్పద వ్యక్తులు నివసిస్తున్నట్లు స్థానికుల ద్వారా సమాచారం అందిందన్నారు. దేశ భద్రతతో పాటు స్థానిక శాంతిభద్రతలకు ఇటువంటి అక్రమ వలసలు ముప్పుగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. బయోమెట్రిక్ వివరాలు, ఆధార్ కార్డులు, ఇతర గుర్తింపు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించడం ద్వారా మాత్రమే అసలైన స్థానికులను, అక్రమంగా నివసిస్తున్న వారిని గుర్తించగలమన్నారు. నకిలీ పత్రాలతో కొందరు ఇక్కడ స్థిరపడటం వల్ల స్థానిక మైనార్టీలకు అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ ఫలాలు, ఉపాధి అవకాశాలు దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. పోలీస్ ఉన్నతాధికారులు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుని ప్రత్యేక బృందాలతో గుండ్లపోచంపల్లి డివిజన్ అంతటా సమగ్ర గ్రౌండ్ వెరిఫికేషన్ నిర్వహించాలని, చట్టవిరుద్ధంగా నివసిస్తున్న వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి చింతలపూడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయునిపై కఠినమైన చర్య తీసుకోవాలి

జయభేరి, కొండమల్లేపల్లి :




అఖిల్ భారతీయ విద్యార్థి పరిషత్ కొండమల్లేపల్లి నగర శాఖ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ లో (13) సంవత్సరాల రామ్ చరణ్ విద్యార్థితో ఉపాధ్యాయులు పాఠశాలకు తోరణాలను కట్టిస్తున్న తరుణంలో విద్యార్థికి విద్యుత్ తీగలు తాగి పాఠశాల గేటు మీద నుండి కిందపడి హాస్పిటల్ బారిన పడిన ఉపాధ్యాయులపై పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎబివిపి ఖండిస్తూ. ఈ సంఘటనపై ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నూతన విద్యా సంవత్సరం సందర్భంగా రాష్ట్రమంతా ప్రభుత్వం మరియు ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రారంభం చేస్తున్న తరుణంలో కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఉన్నటువంటి అటెండర్లు చేసేటటువంటి పనిని ఉపాధ్యాయులు చిన్నపిల్లలతో చేయిస్తూ పనులు చేపిస్తూ దారుణం చోటుచేసుకుంది నాంపల్లి మండలం బండ తిమ్మాపురం గ్రామానికి చెందిన విద్యార్థి కొండ మల్లెపల్లిలోని ఓ ప్రైవేట్ స్కూల్ లో చదువుతున్నాడు స్కూల్ పక్కన ఇల్లు ఉండటంతో ఆడుకోవడానికి స్కూల్ వెళ్లిన రామ్ చరణ్(13) 8వ తరగతి ఈ రోజు స్కూల్ ఓపెనింగ్ కావడంతో ఆడుకుంటున్న రామ్ చరణ్ ని పిలిచి గేట్ కి తోరణాలు కట్టమనీ స్కూల్ ఉపాధ్యాయులు చెప్పడంతో బాలుడు రామ్ చరణ్ తోరణం కట్టడానికి వెళ్ళి విద్యుగ్ఘాతానికి గురైన బాలుడు గేటు మీద నుండి కిందపడి తలకు గాయమైన సంఘటనతో దేవరకొండలోని ప్రయివేట్ హాస్పిటల్ కి తరలించి చికిత్స అందిస్తు హైదరాబాద్ హాస్పిటల్ కి బాలుడిని తరలించడం జరిగింది ఈ ఘటనకు కారణమైన ఉపాధ్యాయుడు పై అదేవిధంగా పాఠశాల ప్రిన్సిపాల్ పై కఠినమైన చర్యలు తీసుకోవాలని విద్య అధికారులకు తెలియజేస్తూ అదే విధంగా విద్యుత్ షాక్కు కు గురైన బాలుడు రామ్ చరణ్ కు మెరుగైన వైద్యం అందిస్తూ వారి కుటుంబానికి రాయింటి అందజేయాలని ఏబీవీపీ కొండమల్లేపల్లి శాఖ డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో కొండమల్లేపల్లి నగర కార్యదర్శి పర్వతం దినేష్, పగిళ్ల విక్రమ్, వినయ్, చరణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## భర్త పైశాచికత్వం..

- భార్యను గొలుసుతో స్తంభానికి కట్టేసిన వైనం

జయభేరి, భోపాల్, జూన్ 15 :

మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కట్టుకున్న భర్తే కాలయముడై భార్యను 24 గంటల పాటు నరకయాతనకు గురిచేశాడు. మెడకు ఇనుప గొలుసు బిగించి, స్తంభానికి కట్టి, వేడి రాడ్‌తో వాతలు పెట్టి తన పైశాచికత్వాన్ని చాటుకున్నాడు. అయితే, ఆ నరకం నుంచి అసామాన్య ధైర్యంతో తప్పించుకున్న ఆ మహిళ, మెడలో గొలుసుతోనే 6 కిలోమీటర్లు నడిచి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని, తనను బంధించిన గొలుసునే భర్త అకృత్యాలకు సాక్ష్యంగా మార్చింది. బాధితురాలు మంగీబాయి తన్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 10వ తేదీ సాయంత్రం ఆమె భర్త మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. రాత్రి భోజనం తర్వాత ఆమెను దూషించడం ప్రారంభించాడు. ఆమె ఎదురు తిరగడంతో కర్రతో విచక్షణారహితంగా దాడి చేశాడు.

దెబ్బలు తాళలేక, పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు మంగీబాయి రాత్రికి రాత్రే ఇంటి నుంచి బయటకు వెళ్లింది. కిల్చీపూర్ పోలీస్ స్టేషన్‌కు నడిచి వెళ్తుండగా, మార్గమధ్యంలో ఓ ఆలయం వద్ద భర్త ఆమెను అడ్డగించి, మళ్లీ దాడి చేసి బలవంతంగా గ్రామానికి తీసుకెళ్లాడు. ఇంటికి తీసుకొచ్చాక అతని రాక్షసత్వం మరింత పెరిగింది. "ఇప్పుడెలా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి నాపై ఫిర్యాదు చేస్తావో చూస్తా" అంటూ ఆమె మెడకు ఇనుప గొలుసు చుట్టి, దానికి తాళం వేసి ఇంటిలోని ఓ స్తంభానికి కట్టేశాడు. అంతటితో ఆగకుండా గ్యాస్ స్టవ్‌పై ఇనుప రాడ్‌ను వేడి చేసి ఆమె నడుము, తుంటి, కుడి తొడపై వాతలు పెట్టాడు.

ఆమె నొప్పితో ఎంత అరిచినా ఎవరూ సహాయానికి రాలేదు. దాదాపు 24 గంటల పాటు ఆమెను ఆ గదిలోనే బంధించాడు. ఈ సమయంలో పోలీసుల వద్దకు వెళ్లకుండా ఆమెపై ఒత్తిడి తెచ్చేందుకు గ్రామస్థులతో పంచాయితీ పెట్టేందుకు ప్రయత్నించాడు. భర్త హింసను భరించలేక, ఆమె తప్పించుకోవడానికి అంగీకరించినట్లు నటించింది. భర్త పంచాయితీ కోసం గ్రామస్థులను పిలవడానికి బయటకు వెళ్లినప్పుడు, మంగీబాయికి ఒంటరిగా ఉండే అవకాశం దొరికింది. అక్కడ కనిపించిన ఒక రాయిని తీసుకుని గొలుసుకు వేసిన తాళాన్ని పగలగొట్టి అక్కడి నుంచి తప్పించుకుంది.

చిమ్మచీకటిలో మెడకు వేలాడుతున్న గొలుసు, తాళంతోనే ఆమె కిల్చీపూర్ వైపు నడక ప్రారంభించింది. ముళ్ల కంపలు, రాళ్ల దారిలో నడుస్తుండగా ఆమె పాదాలకు తీవ్ర గాయాలయ్యాయి. దారిలో ఆమెను చూసిన కొందరు మానసిక అనారోగ్యంతో ఉందని భావించారు. కానీ, ఒక వ్యక్తి మాత్రం ఆమె పరిస్థితిని గమనించి తినడానికి కొంత ఆహారం ఇచ్చాడు.



## ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి

- రైట్ టు ఇన్ఫర్మేషన్ ఆక్టివిస్ట్ సొసైటీ (ఆర్టిఐఏఎస్)- రాష్ట్ర అధ్యక్షులు డా. కొర్ర కిషన్ నాయక్

జయభేరి, దేవరకొండ :

రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న ప్రైవేట్ పాఠశాలల ఫీజులను అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణమే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని ఆర్టిఐఏఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా..కొర్ర కిషన్ నాయక్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యా వ్యాపారమే పరమావధిగా సాగుతున్న ప్రైవేట్ విద్యాసంస్థల ధనదాహానికి సామాన్య, మధ్యతరగతి తల్లిదండ్రులు బలైపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డా,, కొర్ర కిషన్ నాయక్ మాట్లాడుతూ... ఫీజుల పేరుతో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నాయని మండిపడ్డారు. విద్యా ప్రమాణాలను పెంచడం పక్కన పెట్టి, కేవలం లాభార్జనే ధ్యేయంగా విద్యాసంస్థలను నడుపుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా, విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల ప్రాంగణాల్లోనే పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, టై, బెల్ట్, యూనిఫామ్‌లను విక్రయిస్తూ ప్రైవేట్ యాజమాన్యాలు దోపిడీకి తెరలేపుతున్నాయని మండిపడ్డారు. బయట మార్కెట్ కంటే రెట్టింపు ధరలకు ఈ వస్తువులను పాఠశాలల్లోనే కొనాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకురావడం అన్యాయం అని అన్నారు. కళ్ళ ముందే ఇంతటి దోపిడీ జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను క్రమబద్ధీకరించడానికి తక్షణమే ఒక బలమైన ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి. నిబంధనలు ఉల్లంఘించి స్కూల్ క్యాంపస్‌లలో పుస్తకాలు, యూనిఫామ్‌లు విక్రయిస్తున్న విద్యాసంస్థలపై అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రతి పాఠశాలలో ఫీజుల వివరాలను, నిబంధనలను పారదర్శకంగా బోర్డులపై ప్రదర్శించేలా చూడాలి. సామాన్యుడికి విద్యను దూరం చేస్తున్న ఇటువంటి వ్యాపార ధోరణిపై విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి, తనిఖీలు చేపట్టాలని సూచించారు.

## భట్టి విక్రమార్కకి జన్మదిన శుభాకాంక్షలు



జయభేరి, దేవరకొండ :

తెలంగాణ డిప్యూటీ ముఖ్యమంత్రి & ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదినం సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న భట్టి విక్రమార్క ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండి మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేసేలా భగవంతుడు ఆశీర్వదించాలని ఆకాంక్షించారు. భట్టి విక్రమార్క కి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# పేరుకుపోయిన పూడికతోనే వరద ముప్పు

- స్లాబులు తొలగించి వరదకు దారి చూపుతున్నహైడ్రా
- కొండాపూర్ జూబ్లీ గార్డెన్స్ లో హైడ్రా చర్యలు
- వరద ముప్పు ప్రాంతాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్
- స్లాబులు తొలగించిన దగ్గర గ్రిల్స్ ఏర్పాటు చేయాలంటూ ఆదేశం



**జయభేరి, హైదరాబాద్, జూన్ 15:**

కాలువలపైన వేసిన స్లాబులే వరదకు కారణంగా నగరంలో పరిణమించింది. కనీసం డీ సిల్టింగ్ చేయడానికి కూడా అవకాశం లేకుండా చేయడంతో సమస్యల తీవ్రత పెరుగుతోంది. కొండాపూర్‌లోని జూబ్లీగార్డెన్, శంషాబాద్, అత్తాపూర్, రామ్‌దేవ్‌బాబానగర్ ప్రాంతాల్లో వరద ముప్పునకు నాలాల్లో పేరుకుపోయిన పూడికే ప్రధాన కారణంగా హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారి క్షేత్ర స్థాయి పర్యటనలో తెలింది. ప్రతి 3 మీటర్లకు వరద కాలువలను ఓపెన్ చేసే వ్యవస్థ ఉంటే.. డీసిల్టింగ్ పనులు పూర్తి స్థాయిలో జరిగేవని స్థానిక అధికారులు చెప్పారు. ట్రాఫిక్ జాయింట్ సీపీ శ్రీ డి. జోయెల్ డేవిస్‌తో పాటు పలు శాఖలకు చెందిన అధికారులు కమిషనర్ పర్యటనలో ఉన్నారు. వందల మీటర్ల కొద్దీ స్లాబ్‌లు తెరవడానికి కూడా వీలు లేకుండా మూసేయడంతో లోతట్టు ప్రాంతాలలో పెద్దమొత్తంలో చెత్త పేరుకుపోయి వరద ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడ్డాయనేది క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు నిర్ధారించారు. బొటానికల్ గార్డెన్స్, శ్రీ రాంనగర్, కొండాపూర్ పోలీసు బెటాలియన్ నుంచి భారీగా వచ్చిన వరద మీనాక్షి టవర్స్‌కు చేరువలో ఉన్న మొండి కుంటకు చేరాలి. మొండికుంట నిండిన తర్వాత ఔటెలెట్ ద్వార ముల్లకత్వా చెరువులోకి వెళ్లాల్సిన వరద కాలువలు పూర్తిగా పూడుకుపోవడంతో జూబ్లీ గార్డెన్స్ ను వరద ముంచెత్తిందని చెప్పారు.

**స్లాబులు తొలగించి పూడికతీత..**

శనివారం నుంచే జూబ్లీగార్డెన్స్ ప్రాంతంలో నాలాలపై స్లాబులు తొలగించి పూడికను పెద్దయెత్తున హైడ్రా తొలగిస్తోంది. పక్కనే మీనాక్షి అపార్టుమెంట్స్ ఆవరణ నుంచి 2.15 మీటర్ల వైశాల్యంలో వెళ్లాల్సిన వరద కాలువ మీటరున్నరకు కుంచించుకుపోవడమే కాకుండా.. పైపులైను వేయడంతో వరద పోటెత్తుతోందని అధికారులు గుర్తించారు. అలాగే వరద కాలువను నేరుగా మొండికుంట చెరువులోకి వదిలేయకుండా.. మురుగు నీరును డైవర్ట్ చేసేందుకు ఉద్దేశించి చేపట్టిన కాలువల అనుసంధానంలో ఉన్న లోపాలు కూడా వరద పోటెత్తడానికి కారణమైంది. ఈ సమస్యలను ఒకదాని తర్వాత ఒకటి పరిశీలించిన హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు. నాలాలపై అవసరమైన మేరకు స్లాబులు తొలగించి పూర్తిగా డీసిల్టింగ్ పనులు చేపట్టాలని హైడ్రా కమిషనర్ ఆదేశించారు. డీ సిల్టింగ్ పనులు అయిన తర్వాత ఓపెన్ నాలాలను గ్రిల్స్‌తో మూసేయాలని సూచించారు. ప్రతి 3 మీటర్లకూ తెరచే విధంగా ఈ ఏర్పాట్లుండాలన్నారు.



## HWO గా బాధ్యతలు స్వీకరించినడి భాగ్యలక్ష్మికి మెమెంటో శాలువతో సన్మానం

**జయభేరి, దేవరకొండ :**

జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల వెనుకబడిన తరగతుల కళాశాల వసతి గృహం దేవరకొండ HWO డి.భాగ్యలక్ష్మి కి ఘన సన్మానం. దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ బాలికల కళాశాల వసతిగృహం HWO గా బాధ్యతలు స్వీకరించిన డి భాగ్యలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికి మెమెంటో,శాలువతో సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ మీరు ఈ ప్రాంతానికి రావడం చాలా సంతోషదాయకమని ఈ ప్రాంతంలో విద్యార్థుల యొక్క భవిష్యత్తును తీర్చిదిద్ది భవిష్యత్ తరాలకు దిక్సూచిగా అన్ని రంగాల్లో రాణించే విధంగా ముందుకు వెళ్లాలని కోరారు.మీ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉండాలని దానితోపాటు మా సహాయ సహకారాలు కూడా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమం లో సామాజికవేత్త,జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్, పున్న వెంకటేష్‌నేత,డబ్బేకర్ పెంటోజీ,గడ్డం బిక్షమయ్య, అప్పం వీరయ్య, గరిడి విజయభాస్కర్, భూతరాజు శ్రీధర్, సాధే జయప్రకాశ్ నారాయణ,భూషరాజు నిరంజన్, గుండెబోయిన సురేష్,బి. శంకరయ్య, బచ్చనబోయిన శివ, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం రీ సర్వే

- మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామూర్తి



**జయభేరి, పరవాడ:**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రీసర్వేతో గ్రామాలలో భూసమస్యలకు శాశ్వత పరిష్కరం లభిస్తుందని నాయుడుపాలెం పంచాయతీ మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామూర్తి అన్నారు. పరవాడ మండలం నాయుడుపాలెం పంచాయతీ కొండవానిపాలెం లో సోమవారం రీసర్వేను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ గతంలో జరిగిన సర్వే మొక్కుబడిగా సాగిందన్నారు. ప్రస్తుతం రైతుల సమక్షంలో ఎటువంటి వివాదాలకు తావులేకుండా సర్వే జరుగుతుందని. 285 సర్వే నెంబర్లలో సర్వే చేయనున్నట్లు తెలిపారు. రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాధారు పాసుపుస్తకాలు, ఆధారు కార్డు తీసుకుని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో అప్పారావు, సర్వేయర్లు , బాలరాజు, పవన్, వీఆర్ఏలు రాజు, లోవరాజు, రైతులు చీపురుపల్లి దేవుడుబాబు, కూండ్రపు కనకరాజు, కూండ్రపు చిన్న అప్పారావు, పోతల రామకృష్ణ, మాసవరపు ముత్యాలు , కణితి సోమేష్, కణితి శివ, కణితి దేముడు, కణితి నర్సింగరావు, కణితి ఆదినారాయణ , కణితి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

## సర్ బూత్ లెవెల్ ఏజెంట్స్ సమావేశం

- వైస్సార్సీపీ ఉమ్మడి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ కురసాలని మర్యాదపూర్వకంగా కలిసిన పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్



**జయభేరి, పరవాడ:**

పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ సోమవారం కాకినాడలో గల మాజీ మంత్రి ఉమ్మడి విశాఖ, విజనగరం జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబును మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలో జరిగిన వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన, సర్ బూత్ లెవెల్ ఏజెంట్స్ సమావేశం తదితర అంశాల పై చర్చించి వివరించారు. వారితో పాటు పార్వతీపురం మన్యం జిల్లా పరిశీలకుడు సర్గడం చిన అప్పలనాయుడు, సీనియర్ నాయకులు నారపిన్ని అప్పలరాజు, మాటూరు అప్పారావు, ఆళ్ల శ్రీనివాస్, శెట్టి అప్పారావు, ఆళ్ల సత్య అప్పారావు, బట్టు సతీష్ రెడ్డి, నమ్మి రమేష్ తదితరులు ఉన్నారు.

## పిల్లల తల్లులకు నవచేతన ఈసీడీ స్క్రీనింగ్పై అవగాహన కార్యక్రమం



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం మరిసివానిపాలెం గ్రామంలో పిహెచ్ పరిధిలో కల్గిన అంగన్వాడీ కేంద్రాల్లో సెక్టార్ సూపర్వైజర్ ఏ శ్యామల కుమారి 0 నుండి 6 సంవత్సరాల పిల్లల తల్లులకు నవచేతన ఈసీడీ స్క్రీనింగ్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడి కార్యకర్తలు నవచేతన యాప్ లో పిల్లలకు స్క్రీనింగ్ చేసేటప్పుడు తల్లులందరు సహకరించవలసిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమం పరవాడ మండల సెక్టార్ పరిధిలో ఉన్న అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కనకమహాలక్ష్మి, భవాని పాల్గొన్నారు.




## ప్రభుత్వ పెన్షనర్స్ భవన నిర్మాణ నిధికి విరాళం అందజేత

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు తాడిశెట్టి నరసింహ, అంకం చంద్రమౌళి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు 5 విడతల కరువు బత్యం విడుదల చేయకపోవడం, 2023లో అమలు చేయవలసిన పే రివిజన్ కమిషన్ అమలు చేయకపోవడం, హెల్త్ కార్డులు పనిచేయకుండానే మే నెల పెన్షన్ నుండి 1.5 శాతం కోత విధించడం బాధాకరం. వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వంను కోరినారు. జిల్లా ఉపాధ్యక్షులు కంచర్ల నారాయణ రెడ్డి రూ. 50,000లు, గుంజ సుమాల తన భర్త గుంజ కృష్ణయ్య జ్ఞాపకార్థం రూ. 10,000లు గంధం వసంత తన భర్త శ్రీనివాసులు జ్ఞాపకార్థం రూ. 5,000లు కోశాధికారి పంగునూరు లింగయ్యకు అందజేసినారు. సంయుక్త కార్యదర్శి వనం బుచ్చయ్య క్వాంటం వచ్చిన సందర్భంగా రూ. 5,000 విరాళం ప్రకటించినారు. అనంతరం గుంజ సుమాల ఫ్యామిలీ పెన్షనర్ 65వ పుట్టినరోజు వేడుక ఘనంగా నిర్వహించడం జరిగినది. ఉపాధ్యాక్షులు ఆకులపల్లి ఇజాక్ హాజరైన కార్యవర్గంనకు, కార్యవర్గ సభ్యులకు, సభ్యులకు అందరికి కృతజ్ఞతలు తెలియజేసినారు.

## మున్సిపల్ కమిషనర్ ను కలిసిన బిజెపి నాయకులు

- కమిషనర్ ను శాలువాతో సత్కరించిన బిజెపి నాయకులు





**జయభేరి, పరకాల, జూన్ 15:**

పరకాల మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పవన్ ని మున్సిపల్ కార్యాలయంలో బిజెపి పరకాల పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో పార్టీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ ని శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. బిజెపి నాయకులు పరకాల పట్టణ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారంపై కమిషనర్‌తో చర్చించారు. పట్టణ ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడంలో ఆయన సమర్థవంతంగా పనిచేయాలని పార్టీ నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పరకాల మున్సిపల్ 15వ వార్డు కాన్సిలర్ కుక్కల విజయ్ కుమార్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంగా పురుషోత్తం, నాయకులు కుంటమల్ల గణేష్, ఆదిత్య, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విష్ణు కెమికల్ ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలి

- మృతుడి కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలి
- ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గని శెట్టి డిమాండ్




**జయభేరి, పరవాడ:**

పరవాడ ఫార్మసిటీలో విష్ణు కెమికల్ పరిశ్రమలో సోమవారం మధ్యాహ్నం నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కార్మికుడు మృతి చెందడం దురదృష్టకరమని వెంటనే సమగ్ర విచారణ చేసి మృతిని కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని ఫార్మసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పరిశ్రమ గేటు వద్ద మాట్లాడుతూ వలస కార్మికులకు విజయ విధమైన రక్షణ చర్యలు చేపట్టడం లేదని భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని కార్మిక కుటుంబానికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ లేబర్ అధికారులు వెంటనే పరిశ్రమలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించాలని భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కార్మికుడు కుటుంబాన్ని ఆదుకోవాలని గని శెట్టి డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేస్తున్నట్లు గని శెట్టి తెలిపారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ

**జయభేరి, పరకాల, జూన్ 15:**



ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం పరకాల పట్టణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా నూతన విద్యా సంవత్సరంలోకి అడుగుపెడుతున్న విద్యార్థులందరికీ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ, పట్టణ కమిటీ తరపున వారికి స్వాగత శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ హేమంత్ పరకాల పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్ మాట్లాడుతూ పరకాల పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయలేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు అని అన్నారు. విద్యార్థులకు సరిపడా రూమ్స్ లేవు, పాఠశాల ప్రిన్సిపాల్ తో మాట్లాడి స్కూల్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు వసతులు కల్పించాలన్నారు. లేదంటే రాబోయే రోజుల్లో పరకాల పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు బన్నీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహం బతుకు ఆగంపై రాష్ట్రవ్యాప్త పోరు

- తరుణి స్వచ్ఛంద సంస్థ తో అవగాహన ఒప్పందం చేసుకున్న తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ

**జయభేరి, హైదరాబాద్ :**



రాష్ట్రంలో బాల్య వివాహాలు, మైనర్ గర్భధారణలను అరికట్టేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ కీలక అడుగు వేసింది. ఈ దిశగా బాలికల సాధికారత, బాల్య వివాహాల నిరోధం, మానవ అక్రమ రవాణా నిరోధం వంటి అంశాల్లో రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న తరుణి స్వచ్ఛంద సంస్థతో మహిళా, శిశు సంక్షేమ శాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సోమవారం సచివాలయంలో మంత్రి సీతక్క సమక్షంలో ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఒఝా, తరుణీ ఫౌండర్స్ మమతా రఘువీర్, రఘువీర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, బాల్య వివాహం ఒక కుటుంబ సమస్య మాత్రమే కాదని, అది బాలికల భవిష్యత్తును ప్రభావితం చేసే సామాజిక సమస్య అని పేర్కొన్నారు. బాల్య వివాహాల కారణంగా బాలికల విద్య మధ్యలోనే ఆగిపోవడం, ఆరోగ్య సమస్యలు తలెత్తడం, ఆర్థిక స్వావలంబన దెబ్బతినడం వంటి అనేక ప్రతికూల ప్రభావాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. బాల్య వివాహంబతుకు ఆగం అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియా కేంద్రంగా ఈ ప్రచారం మరింత విస్తృతంగా జరగాలన్నారు. తెలంగాణలో బాల్య వివాహాలు, మైనర్ గర్భధారణల నివారణకు ప్రభుత్వం ఇప్పటికే అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, ఇప్పుడు తరుణి వంటి అనుభవజ్ఞ సంస్థ సహకారంతో ఈ ప్రయత్నాలను మరింత విస్తృత స్థాయిలో తీసుకెళ్తామని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బాలికలకు వారి హక్కులు, ఆరోగ్యం, విద్య, భద్రతపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఈ ఒప్పందం ద్వారా అంగన్వాడీ సిబ్బంది, సూపర్వైజర్లు, సీడీపీవోలు, ఇతర శాఖల క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రత్యేక శిక్షణలు అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే సామాజిక మాధ్యమాలు, డిజిటల్ ప్రచార కార్యక్రమాల ద్వారా బాల్య వివాహాల దుష్పరిణామాలు, మైనర్ గర్భధారణల ప్రమాదాలపై విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. బాలికల విద్య, ఆరోగ్యం, సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న మంత్రి, “ప్రతి బాలిక తన కలలను సాకారం చేసుకునే వాతావరణం కల్పించడం మనందరి బాధ్యత. బాల్య వివాహాలకు పూర్తిగా ముగింపు పలకడానికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, సమాజం కలిసి పనిచేయాలి” అని పిలుపునిచ్చారు. తరుణి స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ మమతా రఘువీర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి బాల్య వివాహాలు, మైనర్ గర్భధారణల తగ్గింపునకు సాంకేతిక సహకారం, అవగాహన కార్యక్రమాలు, శిక్షణలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# టీవీ నటి సంచితా ఉగాలే ఆత్మహత్య..




టీవీ నటి సంచితా ఉగాలే ఆత్మహత్య చేసుకున్నది. కుమ్‌కుమ్ భాగ్య సీరియల్‌లో ఆమె కీలక పాత్ర పోషించింది. ఆమె వయసు 22 ఏళ్లు. కుమ్‌కుమ్ భాగ్య టీవీ షోతో ఆమె పాపులర్ నటిగా మరింది. చావా చిత్రంలో కూడా ఆమె నటించింది. సంచితా ఆత్మహత్యతో ఆమె అభిమానులు షాక్‌లోకి వెళ్లారు. ఆత్మహత్య చేసుకోవడానికి కొన్ని గంటల ముందు ఆమె తన సోషల్ మీడియాలో ఫోటోలు, వీడియోలు షేర్ చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. ముంబైలోని నలసోపోరా ప్రాంతంలో తన పేరెంట్స్, సోదరితో కలిసి ఉంటోంది. ఆత్మహత్య ఘటన జరిగిన సమయంలో ఆమె ఇంట్లో ఒంటరిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఏ కారణం చేత ఆమె ఆత్మహత్యకు పాల్పడిందో ఇంకా స్పష్టంగా తెలియదు. రూమ్‌లోని సీలింగ్ ఫ్యాన్‌కు నటి సంచితా ఉరి వేసుకున్నట్లు పోలీసులు చెప్పారు. ఆమెను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లినా.. మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. యాక్సిడెంటల్ డెత్ రిపోర్టును రిజిస్టర్ చేశారు.



# గర్వంగా చెప్పుకోలేని ఎన్నో సినిమాల్లో నటించా..

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత టైటిల్ రోల్‌లో నటిస్తున్నచిత్రం 'మా ఇంటి బంగారం'. నందినీ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్ ప్రేక్షకులను ఇంప్రెస్ చేస్తూ మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతోంది. ఈ చిత్రం జూన్ 19న థియేటర్లలో విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా సమంత తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తాను గర్వంగా చెప్పుకోలేని ఎన్నో సినిమాల్లో నటించానంది సామ్. చాలా తక్కువ టైంలోనే ప్రజలు నన్ను ఎంతగానో ఆదరించారు.. ఉత్సాహంగా నా పేరును కేకలు వేస్తూ పిలవడం, నా సినిమాల కోసం ఆసక్తిగా ఎదురుచూడటం మొదలుపెట్టారు. ఇదంగా చూసి నేను ఆశ్చర్యపోయాను. ఆ స్టార్‌డమ్ అనే మాయలో మునిగిపోయానని చెప్పింది సమంత. అంతేకాదు మీడియా నా గురించి రాస్తోంది. ఏడాదికి నేను ఎన్ని సినిమాల్లో నటించాననే విషయాలపైనే ఎక్కువ ఆసక్తి చూపించేదానిని అంటూ చెప్పుకొచ్చింది. హిట్ సినిమాలు, బ్లాక్ బస్టర్ సినిమాలను అందిస్తున్నప్పటికీ తాను అసలు సినిమాకు ఏం ఇస్తున్నానని ఎప్పుడూ కూడా ఆలోచించలేదని చెప్పింది. ఈ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఓ వైపు గృహిణిగా, మరోవైపు వీరవనితలాగే ఉగ్రరూపం చూపిస్తూ సాగుతున్న ట్రైలర్ సినిమాలో సామ్‌ను సరికొత్తగా చూపించబోతున్నట్టు చెప్పకనే చెబుతోంది. పెళ్లి అయిన అనంతరం పల్లెటూరికి కోడలిగా వెళ్లిన సమంతకి అక్కడ ఎదురైన సంఘటనలు ఏంటి.. తన గతం ఏంటి అనేది ఈ సినిమా కథ అని తెలుస్తుంది. ప్రముఖ దర్శకుడు సమంత భర్త రాజ్ నిడిమోర్ ఈ కథను రాయగా.. సమంత సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా పిక్చర్స్ దీనిని నిర్మిస్తోంది. సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందిస్తున్నారు.


# ఆద్యంతం నవ్వించే 'సూపర్ సుబ్బు'



కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పిస్తూ వినోదాత్మక కథాంశంతో తెరకెక్కిన వెబ్‌సిరీస్ 'సూపర్ సుబ్బు'. సందీప్‌కిషన్, మిథిలా పాల్కర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్ జూలై 2 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా సోమవారం ఓ వీడియోను విడుదల చేశారు. 'ఓ అమాయక యువకుడు..అత్యంత సంప్రదాయ గ్రామం..అసాధ్యమైన ఓ ఉద్యోగం' అనే క్యాప్షన్‌తో రిలీజ్ చేసిన ఈ వీడియో గ్లింప్స్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగింది. సుబ్రహ్మణ్యం అలియాస్ సుబ్బు అనే యువకుడు ప్రజల్లో కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో మాకిపూర్ అనే గ్రామంలోకి అడుగుపెడతాడు. అక్కడ అతనికి అనుకోని వింత పరిస్థితులు ఎదురవుతాయి. ఈ క్రమంలో అతను తన ప్రేమ, కుటుంబం, కెరీర్‌ను పణంగా పెట్టాల్సివస్తుంది. ఈ నేపథ్యంలో అతను తీసుకున్న నిర్ణయమేమిటన్నది ఈ కథలో ఆసక్తికరమని ఈ సిరీస్ క్రియేటర్, దర్శకుడు మల్లిక్‌రామ్ తెలిపారు. బ్రహ్మానందం, మురళీశర్మ, సంపూర్ణేష్‌బాబు ఈ సిరీస్‌లో కీలక పాత్రల్ని పోషించారు.

# బాలీవుడ్ స్టార్ హీరో దత్తత కూతురు పెళ్లి..





మిథున్ దా ప్రియమైన కుమార్తె దిశాని చక్రవర్తి తన జీవితంలో ఒక మధురమైన ప్రయాణాన్ని ప్రారంభించారు. ఇప్పుడు ఈ ఫోటోలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. బాలీవుడ్ సీనియర్ నటుడు, 'డిస్కో డాన్సర్' మిథున్ చక్రవర్తి ఇంట్లో క్లారినెట్, కోరల్ సంగీతపు స్వరాలు మారుమోగడానికి ప్రస్తుతం ఏర్పాట్లు జరుగుతున్నాయి. మిథున్ ముద్దుల కూతురు దిశాని చక్రవర్తి తన జీవితంలో మధురమైన ప్రయాణాన్ని ప్రారంభించింది. స్టార్ నటుడి ఇంట్లో పెళ్లి సందడి వార్త ఇప్పుడు బాలీవుడ్‌లోనే కాదు హాలివుడ్‌లో వినిపిస్తోంది. దిశాని తన ప్రియుడు మైల్స్ మంట్జారిస్‌తో అంగరంగ వైభవంగా నిశ్చితార్థం చేసుకుంది. ఈ వేడుకకు సంబంధించిన ఎంతో రొమాంటిక్ ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకుని ఆమె తన అభిమానులకు ఒక ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ జంట డిసెంబర్ 6, 2026న వివాహం చేసుకోబోతున్నారు. అంటే మరో 6 నెలల్లో మిథున్ చక్రవర్తి ఇంట్లో పెళ్లి బాజాలు మోగనున్నాయి.

దిశాని, మైల్స్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పోస్ట్ పంచుకున్నారు. ఇందులో మైల్స్ చాలా సినిమాటిక్ స్టైల్‌లో మోకాలిపై కూర్చుని దిశానికి ప్రపోజ్ చేస్తుండగా రెండవ ఫోటోలో దిశాని తన వేలికి ఉన్న పెద్ద వజ్రపు ఉంగరాన్ని చూపిస్తోంది. అంటే ఇద్దరం రింగేజ్‌మెంట్ (నిశ్చితార్థం) చేసుకున్నామని పబ్లిక్‌గా అందరితో షేర్ చేసుకున్నారు. ఈ ఫోటోను పంచుకుంటూ దిశాని క్యాప్షన్‌లో "06.12.2026 నాకు తెలిసినంతలో ఇదే అత్యంత సులభమైన శాశ్వతత్వం" అని రాసింది. నటి సెలీనా జైట్లీతో సహా పలువురు సెలబ్రిటీలు ఆమె పోస్ట్‌పై ప్రశంసల వర్షం కురిపించారు.

దిశాని నిజ జీవిత కథ ఒక సినిమా కథకు ఏమాత్రం తక్కువ కాదు. 2000వ సంవత్సరం అక్టోబర్ 24న జన్మించిన దిశాని పుట్టిన తర్వాత కోల్‌కతాలోని ఒక చెత్తకుండీ దగ్గర వదిలివేయబడింది.

ఈ హృదయ విదారక వార్త స్థానిక వార్తాపత్రికలో ప్రచురితమైనప్పుడు దానిని చదివి మిథున్ చక్రవర్తి గుండె పగిలిపోయింది. ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా తన భార్య యోగితా బాలి అంగీకారంతో ఆయన ఆ చిన్నారిని చట్టబద్ధంగా దత్తత తీసుకున్నారు. చక్రవర్తి కుటుంబం ఆమెకు ఒక పసిపాప కన్నా ఎక్కువ ప్రేమను ఇచ్చింది. ఆమె తన ముగ్గురు తోబుట్టువులైన మిమో, ఉష్మే, నమాషీలకు ప్రియమైన సోదరిగా మారింది. దిశాని కాబోయే భర్త మైల్స్ మాంట్జారిస్, అంతర్జాతీయ చిత్ర పరిశ్రమలో ఒక ప్రసిద్ధ పేరు. ఆయన హాలీవుడ్‌లో విజయవంతమైన స్టెడిక్యామ్ ఆపరేటర్, కలరిస్ట్ (డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ)గా పనిచేస్తున్నారు. ఆయన ESPN, NFL, డిస్నీ, అమెజాన్ , MAX వంటి ప్రపంచంలోని కొన్ని అతిపెద్ద నిర్మాణ సంస్థల కోసం అనేక డాక్యుమెంటరీలు, మ్యూజిక్ వీడియోలు ప్రధాన మార్కెటింగ్ ప్రచారాలపై పనిచేశారు. తన తండ్రిలాగే దిశాని కూడా నటనలో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. ఆమె ముంబైలోని 'ది జెఫ్ గోల్డ్‌బర్గ్ స్టూడియో'లో నటనలో శిక్షణ తీసుకున్నారు. ఆ తర్వాత ఆమె అమెరికాలోని 'న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీ' నుండి తన గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, ప్రఖ్యాత 'లీ స్ట్రాస్‌బర్గ్ థియేటర్ అండ్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్' నుండి రెండేళ్ల ప్రత్యేక కోర్సు చేశారు. ప్రస్తుతం, ఆమె లాస్ ఏంజిల్స్‌లో నివసిస్తూ 'గిఫ్ట్', 'అండర్‌పాస్' , 'ది గెస్ట్' వంటి అనేక హాలీవుడ్ స్వతంత్ర , లఘు చిత్రాలలో పనిచేస్తున్నారు. మరి బాలీవుడ్ , హాలీవుడ్ సెలబ్రిటీల పెళ్లి ముంబైలో జరుగుతుందా లేక అమెరికా ఇతర విదేశాల్లో జరుగుతుందో ఇంకా ప్రకటించలేదు. అయితే వీరి పెళ్లికి పెద్దలు అంగీకారం తెలిపినట్లుగా తెలుస్తోంది.



# ఫేక్ గాళ్లతో జాగ్రత్త!

ప్రస్తుతం సోషల్ మీడియా యుగం నడుస్తున్నది. సామాజిక మాధ్యమాలను ప్రపంచమంతా వాడేస్తున్నారు. ఈ క్రమంలో ఫేక్ ఐడీలు కూడా పుట్టుకొచ్చేస్తున్నాయి. ముఖ్యంగా ఫేమ్ ఉన్న వారి పేర్లతో ఐడీలను క్రియేట్ చేసే సైబర్ నేరగాళ్ల సంఖ్య కూడా భారీగా పెరిగిపోతున్నది. తాజాగా అగ్ర కథానాయిక మీనాక్షి చౌదరి కూడా ఈ ఫేక్ ఐడీ బారిన పడింది. తన పేరుతో ఎవరో ఫేక్ ఐడీని క్రియేట్ చేశారు. దీనిపై ఆమె స్పందిస్తూ 'ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నా పేరు, ఫొటో, ఫేక్ నంబర్‌తో ఫేక్ ఐడీని క్రియేట్ చేసి మోసాలకు తెగబడుతున్నట్టు నా దృష్టికి వచ్చింది. ఎవరికైనా ఈ ఫేక్ నంబర్‌తో కాల్ కానీ, మెసేజ్ కానీ వస్తే, వెంటనే రిపోర్ట్ చేయండి. ఇలాంటి ఫేక్ ఐడీల విషయంలో జనం అలెర్ట్‌గా ఉండాలి. లేకపోతే సర్వస్వం కోల్పోవాల్సి వస్తుంది' అంటూ పేర్కొన్నది మీనాక్షి చౌదరి.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**